ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | శనివారం | 18.07.2026 | సంపుటి : 2 | సంచిక : 17 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



## ధరణి లావాదేవీలపై విచారణకు 'సిట్'

### తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం

ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ

ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినెట్

జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం

పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు

బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం

తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది.

హైదరాబాద్, జూలై 17 : ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీల

-మిగతా 2 లో..




02

### న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి ప్రశంసనీయం

రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం

సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



02

### ప్రయాణికుల్లో రెండో తరగతి సరికాదు

సెకండ్ క్లాస్ కేవలం కోచ్ గుర్తింపునకే

రైల్వేప్రయాణికుల భద్రతపైనా సుప్రీం కీలక వ్యాఖ్యలు

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

### హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం

తొలి రైతులను జెండా ఊపి ప్రారంభించిన మోడీ

అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి చేరింది. భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైందనే చెప్పాలి. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు ప్రయాణించనుంది. ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా దీనిని ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతను రైల్వేలో వినియోగిస్తున్నారు. హైడ్రోజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి రైలును నడిపే ఈ సాంకేతికతను డీజిల్ ట్రైన్స్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటుచేశారు.



న్యూఢిల్లీ, జులై 17 : 'హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో భారత్ చేరడం గర్వకారణం. స్వచ్ఛమైన, సుస్థిర సాంకేతికతను రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే.. రానున్న కాలంలో మరిన్ని మార్గాల్లో ఈ సేవల్ని విస్తరించే అవకాశాలున్నాయి. ఇది రైల్వే రంగంలో కాలుష్య నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్వచ్ఛ ఇంధన వినియోగానికి కొత్త దిశను చూపనుంది. జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాలు హైడ్రోజన్ ఆధారిత రైలు సాంకేతికతను ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నాయి. కాగా.. ప్రపంచంలోనే తొలి హైడ్రోజన్ ప్యాసింజర్ రైలును జర్మనీ ప్రవేశపెట్టింది. 2002లో అల్‌స్టోమ్ కొరాడియా ఐలింట్ రైలు ఎలాంటి ఇంధనం లేకుండా 1,175 కి.మీ. ప్రయాణించి రికార్డు సృష్టించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో 2024లో తొలి హైడ్రోజన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. అయితే.. 2027 నాటికి జపాన్.. తొలి హైడ్రోజన్ హైబ్రిడ్ రైలును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశంలో ప్రారంభం అయిన ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో

-మిగతా 2 లో..

# 8 లక్షల కుటుంబాలకు నగదు రహిత వైద్యం

నూతన ఈహెచ్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

886 ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు

పథకం పరిధిలో 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు





హైదరాబాద్, జూలై 17 : ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) నూతన అధ్యాయానికి నాంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 886 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా 8 లక్షల మంది ఉద్యోగులతో పాటు మొత్తంగా 29.80 లక్షల మంది ఉచిత ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు ఈ పథకం పరిధిలోకి వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని

-మిగతా 2 లో..



03

### నేడు, రేపు బార్లు తెల్లవార్లు ఓపెన్

ఫిఫా కప్ అభిమానుల కోసం సర్కార్ తీపి కబురు

హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో బార్ల పనివేళలను పొడిగిస్తూ కీలక నిర్ణయం

## యువ సంగ్రామ సదస్సుపై రేవంత్ కుట్ర

### అనుమతిని అడ్డుకున్నా.. హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది

నిరుద్యోగుల గళం వినిపిస్తామన్న కెటిఆర్

హైదరబాద్, జూలై 17 : బీఆర్ఎస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు తెలంగాణ హైకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ' జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే యువ సంగ్రామ సదస్సును అడ్డుకొని, నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే... గౌరవ హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా... యువత తరఫున బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుంది. యువతీ యువకులారా.. తరలిరండి..

-మిగతా 2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం


ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

03

రవీంద్రభారతి వేదికగా మంత్రి అందచేత

దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు.





### బాలికను బెదిరించి పలుమార్లు అత్యాచారం

గర్భం దాల్చిన బాలిక..

తల్లిదండ్రుల ఫిర్యాదు

ఇద్దరు యువకులపై ఫోక్సో కేసు నమోదు

03

## సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 'సర్' పూర్తి

95 కోట్ల ఓటర్లకు సేవలందించడం గర్వకారణం

సీఈసీ జ్ఞానేష్ కుమార్

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం)లో దేశంలోని అన్ని రాష్ట్రాల మీడియా ప్రతినిధులతో





# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

(మొదటిపేజీ తరువాయి)

ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసుకురావడమో చేస్తున్నాయి. 1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది. ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ పక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



**న్యూఢిల్లీ,జూలై17 :** న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదు ల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తు లో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 'సర్' పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ముఖాముఖిలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ మీడియా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై వివరించారు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో 95 కోట్ల మంది ఓటర్లకు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 12 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఓటర్ల జాబితాల సవరణలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఏటా దేశంలో దాదాపు 8 కోట్ల మంది ఓటర్ల వివరాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని, అందువల్ల నిరంతర సవరణ ప్రక్రియ అవసరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరి అన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణపై స్పందిస్తూ, నామినేషన్ పత్రంలోని ప్రతి కాలమ్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఎన్నికల నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయన్నారు. కోర్టు కేసుల వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినా ఆమె వినియోగించుకోలేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధించిన రెండు ఓట్ల అంశం కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యాక నిబంధనల మేరకు పరిష్కారమవుతుందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు.

# ధరణి లావాదేవీలపై విచారణకు 'సిట్'

(మొదటిపేజీ తరువాయి)



సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు -రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

# 8 లక్షల కుటుంబాలకు నగదు రహిత వైద్యం



(మొదటిపేజీ తరువాయి)

ఒక చక్కటి ఆరోగ్య భద్రత వ్యవస్థను అందించాలనేదే సర్కారు ఉద్దేశమన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా పని చేస్తారని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతాయని, అన్నారు. శుక్రవారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహతో కలిసి కొత్త ఈహెచ్‌ఎస్ పథకాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనం. ఉద్యోగులు కూడా కుటుంబ సభ్యులే. వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని గమనించాం. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొచ్చింది. అలాగే రాష్ట్రంలో అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. దీని పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు చేసిన కృషిని మరవలేము. అలాంటి ఉద్యోగుల సమస్యలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పదేళ్లలో రూ.10 వేల కోట్లు అప్పు చేసింది కానీ ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసింది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ.10 వేల కోట్ల బిల్లులను మా ప్రభుత్వం మానవీయ కోణంలో క్లియర్ చేస్తోంది. పెండింగ్ బిల్లులను నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి నేను స్వయంగా సమీక్షిస్తున్నా..'అని భట్టి చెప్పారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. 20 ఏళ్ల ఆకాంక్ష ప్రజా ప్రభుత్వంలో నెరవేరిందని చెప్పారు. నగదు రహిత వైద్య సేవలు చరిత్రాత్మక నిర్ణయమన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి మార జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఇదొక శుభదినం'అని అన్నారు. 20 ఏళ్ల కల ఈ రోజు నెరవేరిందన్నారు. ఉద్యోగుల 64 సమస్యల్లో 35 ప్రభుత్వం పరిష్కరించిందని చెప్పారు.

# యువ సంగ్రామ సదస్సుపై రేవంత్ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

సరూర్‌నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం. రేవంత్ సర్కార్ మెడలు వంచుదాం. హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దాం. ఛలో సరూర్‌నగర్ స్టేడియం. నేటి ఉదయం 10 గంటలకు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నిక వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదని బీఆర్‌ఎస్ పార్టీ ఆరోపించింది. ముఖ్యంగా యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదని విమర్శించింది. అందుకోసం జులై 18వ తేదీన సరూర్ నగర్ స్టేడియం వేదికగా యువ సంగ్రామ సదస్సు నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ సదస్సుకు హాజరుకావాలని యువతకు పిలుపునిచ్చింది. ఈ సదస్సు కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాట్లు చేసింది. అయితే దీనికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై శుక్రవారం కోర్టు విచారణ జరిపింది. వాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ నిఘా వర్గాల నుంచి నివేదిక అందిందని ప్రభుత్వం తరఫున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సదస్సు నిర్వహించే ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాట్లు లేవని తెలిపారు. దాంతో 17 రోజుల క్రితం ఈ సదస్సు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ విషయాలను ఆ పార్టీ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదంటూ ప్రశ్నించింది. దీంతో ఈ సదస్సు నిర్వహణకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు మంజూరు చేసింది.



# ప్రయాణికుల్లో రెండో తరగతి సరికాదు


**సెకంట్ క్లాస్ కేవలం కోచ్ గుర్తింపునకే**

**రైల్వేప్రయాణికుల భద్రతపైనా సుప్రీం కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, జూలై 17 :** రైల్వే ప్రయాణికుల ఆత్మగౌరవం, భద్రత, ప్రమాద పరిహారానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఇకపై ప్రయాణికులను 'రెండవ తరగతి ప్రయాణికులు' అని సంబోధించవద్దని రైల్వే శాఖను ఆక్షేపించింది. 'క్లాస్' అనే విభజన కేవలం రైలు కోచ్‌లకు మాత్రమే పరిమితం కావాలని, మనుషులకు కాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రయాణికులను అలా పిలవడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది గత చరిత్రలోని వర్గ విభజనలను గుర్తు చేస్తోందని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ఒక రైలు ప్రమాద బాధితురాలికి రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన కోర్టు.. ప్రమాద సమయంలో టికెట్ పోయినంత మాత్రాన పరిహారాన్ని నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. బాధిత కుటుంబాలు అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని, సదరు ప్రయాణికుడికి టికెట్ లేదని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా రైల్వే శాఖదేనని స్పష్టం చేసింది. రైల్వే ప్రమాద పరిహార చట్టాలను మానవతా దృక్పథంతో, ఉదారంగా అమలు చేయాలని ధర్మాసనం హితవు పలికింది. భద్రతా నిబంధనలు కాగితాల్లో బాగున్నా.. క్షేత్రస్థాయిలో అమలు లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేసింది. రైల్వేల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, రైల్వే భద్రతను కూడా మెరుగుపరచవచ్చని కోర్టు సూచించింది. అదే సమయంలో ప్రయాణికులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రాణాలకు తెగించి ఫుట్‌బోర్డ్ ప్రయాణాలు చేయవద్దని ధర్మాసనం హెచ్చరించింది.

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

- రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం
- కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి



**నరసరావుపేట, జూలై 17 :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.

# నేడు, రేపు బార్లు తెల్లవార్లు ఓపెన్

**ఫిఫా కప్ అభిమానుల కోసం సర్కార్ తీపి కబురు**

**హైదరబాద్,జూలై17 :** ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికుల కోసం తెలంగాణ ప్రభుత్వం బార్లు బార్లా తెరవాలని నిర్ణయించింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. జులై 18, 19 తేదీల్లో రాత్రి తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం విక్రయాలు జరుపుకోవచ్చు. అలాగే, జూలై 19న జరిగే గ్రాండ్ నైల్ మ్యాచ్ వీక్షణ కోసం 19-20 మధ్య తెల్లవారుజామున 3:00 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చారు. ఈ ప్రత్యేక వెసులుబాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోని లైసెన్స్ పొందిన బార్లు, క్లబ్బులు, (టూరిజం బార్లు, మైక్రోబ్రూవరీలకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫుట్‌బాల్ ప్రేమికులపేఉ ఎంతగానో అలరిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ ముగింపు దశకు చేరుకుంది. ఈనెల 19న స్పెయిన్, అర్జెంటీనా టైటిల్ కోసం తలపడనున్నాయి. అలానే జులై 18న మూడో స్థానం కోసం ఫ్రాన్స్, ఇంగ్లండ్ పోటీ పడనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం క్రీడా అభిమానులకు, నగరవాసులకు తీపి కబురు అందించింది. జూలై 18, 19 తేదీల్లో జరిగే అత్యంత కీలకమైన మ్యాచ్‌ల వీక్షణ కోసం హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో బార్ల పనివేళలను పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ
# దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం
ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
రవీంద్రభారతి వేదికగా మంత్రి అందజేత



**హైదరాబాద్,జూలై17:** దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనపాటి, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి,పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అర్చకులు దేవతారాధన, వేదపండితులు వేద పారాయణం, పరిచారకులు నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## మంథనిలో న్యాక్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు

సీఎం రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు

**హైదరాబాద్, జూలై17 :** పెద్దపల్లి జిల్లా మంథనిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ కేంద్ర భవన నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ రంగానికి అవసరమైన అత్యుత్తమ మానవ వనరుల్ని తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకునేలా అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ ఇక్కడ లభించనుంది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల ద్వారా శిక్షణార్థులకు స్వయం ఉపాధితో పాటు ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక న్యాక్ సెంటర్ ను మంథనికి కేటాయించడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణ రంగంలో ఉత్తర తెలంగాణ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ఈ కేంద్రం వారధిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మీడియా అకాడమిలో డిజిటల్ ఆర్కైవ్స్

మనసు ఫౌండేషన్ ప్రతినిధులతో చైర్మన్ చర్చలు

**హైదరాబాద్, జూలై 17 :** తెలంగాణ మీడియా అకాడమీ చేపడుతున్న డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి శుక్రవారం మనసు ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చర్చలు జరిపారు. తెలంగాణ మీడియా అకాడమీ పాత తెలుగు, ఆంగ్ల, ఉర్దూ వార్తాపత్రికలను డిజిటలైజ్ చేసి జర్నలిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు, ఇతర ఆసక్తిగల వారికి లక్షలాది పేజీల సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు సంబంధించిన సుమారు 8 లక్షల పేజీలు డిజిటల్ ఆర్కైవ్‌లో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ విలువైన సమాచారాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ఆర్కైవ్స్‌ను మరింత అభివృద్ధి చేయడం, సమాచార శోధనను సులభతరం చేయడం వంటి అంశాలపై మనసు ఫౌండేషన్ ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిగాయి. సమావేశంలో మనసు ఫౌండేషన్ చైర్మన్ రాయుడు, సభ్యులు చంద్రమౌళి, దాము బాలాజీ, వి. శేషతలపతి సాయి, ఎ.వి. రమణమూర్తి, జగన్ పాల్గొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ తరఫున కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణచందర్ రావు, అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సందర్భంగా మనసు ఫౌండేషన్ దాదాపు 28 లక్షల పేజీల చారిత్రక వార్తాపత్రికలు, పుస్తకాలు, గెజెట్లు, మ్యాగజైన్లు, ఇతర విలువైన పత్రాలను డిజిటలైజ్ చేసి భద్రపరిచిన విశిష్ట సేవలను తెలంగాణ మీడియా అకాడమీ అభినందించింది. భవిష్యత్ తరాలకు చారిత్రక సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఆలస్యంపై జపాన్ మాజీమంత్రి వ్యాఖ్యలు

అందులో ఎంతమాత్రం నిజం లేదన్న విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ,జూలై17 :** ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో జాప్యంపై జపాన్ మాజీ మంత్రి హిడెకీ మకిహారా తాజాగా చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఆ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయమని భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆ కామెంట్స్ వాస్తవాలను ప్రతిబింబించట్లేదని అన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంలో ఇరు దేశాల మధ్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అన్నారు. నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయని చెప్పారు. వచ్చే ఏడాది ఈ ప్రాజెక్టులో తొలి దశ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇక 2030 కల్లా జపాన్‌కు చెందిన ఈ10 సిరీస్ బులెట్ రైళ్లు సరఫరా అవుతాయని ప్రభుత్వ వర్గాలు గతంలో పేర్కొన్నాయి. షిన్‌కాన్సెన్ సాంకేతికతతో ప్లాన్ చేసిన ఈ రైలు ప్రాజెక్టు ముందు అనుకున్న దానికంటే భిన్నంగా ఉందని జపాన్‌కు చెందిన ఒక ఇంజినీర్ ఇటీవల స్థానిక పత్రికలో ఒక వ్యాసం రాశారు. దీనిపై జపాన్ మాజీ మంత్రి హిడెకీ స్పందిస్తూ ఓ భారతీయ మంత్రి, అధికారులు గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. స్వీయ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సిగ్నలింగ్ వ్యవస్థ జపాన్‌కు దక్కలేదని అన్నారు.

## నీటి సంపులో దూకి తల్లీ బిడ్డల ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్ ,జూలై17 :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

## ఆశ్రమం ముసుగులో గంజాయి సాగు

టాస్క్‌ఫోర్స్ దాడిలో బండారం బట్టబయలు

**వికారాబాద్,జూలై17 :** ఓ స్వామీజీ ఆశ్రమంలో గంజాయి సాగు చేయడం కలకలం రేపింది. ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో మత్తు పదార్థాల దందా చేస్తున్న ఆ స్వామీజీ గుట్టును పోలీసులు రట్టు చేశారు. యాలాల మండలం గోవిందరావుపేట శివారులోని ఆశ్రమంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా టీమ్.. ఆశ్రమంపై నిఘా పెట్టి శుక్రవారం ఒక్కసారిగా ఆకస్మిక దాడులు నిర్వహించింది. అక్కడ గంజాయి మొక్కలు సాగు చేస్తుండటాన్ని గుర్తించింది. ఈ దాడుల్లో 25 గంజాయి మొక్కలతో పాటు పెద్ద మొత్తంలో ఎండు గంజాయినీ పోలీసులు గుర్తించారు. అనంతరం ఎక్సైజ్ ఎస్సై నిజాముద్దీన్, యాలాల ఎస్సై విఠల్ రెడ్డి, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామీజీ కాకుండా గంజాయి సాగు వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నారు. కాగా, ఈ తనిఖీల్లో రూరల్, టౌన్ సీఐలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, పరమేశ్వర్ పాల్గొన్నారు. మరోవైపు, స్వామీజీ నిజస్వరూపం బయటపడడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు భక్తితో అక్కడికి వెళ్లామని, ఇలాంటి దొంగ స్వాములపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జులై 17 :** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ పక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ పక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని పక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్‌వైజర్లను అడిగి తీసుకోవాలన్నారు.

## ప్రజాప్రతినిధులపై కేసులతో పదవుల నుంచి తొలగింపు

130వ రాజ్యాంగ సవరణ బిల్లును వాయిదా వేసిన కేంద్రం

**న్యూఢిల్లీ,జూలై17 :** దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు–2025కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రాబోయే వర్షాకాల సమావేశాల్లో ఈ వివాదాస్పద బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకూడదని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. బిల్లుపై అధ్యయనం చేస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తన నివేదిక సమర్పణకు మరికొంత సమయం కావాలని కోరడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పార్లమెంట్ అనెక్స్‌లో బీజేపీ ఎంపీ, జేపీసీ చైర్‌పర్సన్ అపరాజిత సారంగి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో బిల్లుపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, న్యాయపరమైన చిక్కులు, రాజ్యాంగపరమైన అంశాలను పరిశీలించేందుకు మరింత సమయం అవసరమని కమిటీ అభిప్రాయపడింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు, అరెస్టుల అంశానికి సంబంధించి కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. బిల్లు ప్రకారం.. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు వంటి ప్రజాప్రతినిధులు 30 రోజుల పాటు జైలులో ఉండి బెయిల్ పొందలేని పరిస్థితి ఏర్పడితే పదవులు కోల్పోయే విధంగా నిబంధనలు ప్రతిపాదించారు.

## రేషన్‌కార్డుదారులకు ఈకెవైసి తప్పనిసరి

**నిజామాబాద్, జూలై 17 :** రేషన్ కార్డు లబ్దిదారులకు పౌరసరఫరాల శాఖ మరోసారి కీలక సూచనలు జారి చేసింది. ఈ కేవైసీ విషయంలో లబ్దిదారులందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నది. ఇప్పటివరకు ఈ–కేవైసీ చేసుకొని లబ్దిదారులు తమ రేషన్ కార్డులు వెంటబెట్టుకొని వెంటనే సంబంధిత డీలర్లను కలవాలని సూచించింది. ఉచితంగా ఈ–కేవైసీ చేసుకునేందుకు జూలై 31 వరకు గడువు ఉందని నిజామాబాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. ఈ–కేవైసీ చేసుకొని లబ్దిదారులకు భవిష్యత్‌లో సరుకు సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులందరూ వెంటనే తమ రేషన్ కార్డులను ఈ–కేవైసీ చేసుకోవాలని తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్

### కల్తీనెయ్యి స్వాధీనం చేసుకున్న అధికారులు

### కమిషనర్ సంగీత సత్యనారాయణ వెల్లడి

**హైదరాబాద్, జూలై 17 :** రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు. సంబంధిత సంస్థల నుంచి నెయ్యి నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం పంపించామని, పరీక్షల ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలి. తేమ శాతం 0.5 శాతానికి మించకూడదు. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం?2006 ప్రకారం నిషేధం అని ఆమె వివరించారు. ల÷దరాబాద్ క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. 15 నెయ్యి సాంపిల్స్‌ను సేకరించారు. వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ప్రయోగశాల నివేదికలు వచ్చే వరకు భద్రపరిచి, నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ స్పష్టం చేశారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 సంస్థలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పరిశీలించారు. మొత్తం 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 5 సంస్థలకు నోటీసులు జారీ చేశారు. ÷నియోగదారులు లైసెన్స్ ఉన్న, విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు ఈ÷ాంఎ లైసెన్స్ నంబర్, మాన్యుఫాక్చరింగ్ లేబుల్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొన్నారు. కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ విజ్ఞప్తి

## బాలికను బెదిరించి పలుమార్లు అత్యాచారం

గర్భం దాల్చిన బాలిక.. తల్లిదండ్రుల ఫిర్యాదు
ఇద్దరు యువకులపై ఫోక్సో కేసు నమోదు

**నల్లగొండ, జూలై 17 :** ఓ బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన నల్లగొండ జిల్లాలో చోటుచేసుకుంది. నిందితులిద్దరూ చిన్నారిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. ఈ ఘటనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. కొంతకాలంగా నిందితులిద్దరూ చిన్నారిని బెదిరించి లైంగిక దాడికి తెగబడుతున్నారు. పాఠశాలకు వెళ్లే బాలికకు తొలుత ఓ యువకుడు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. అనంతరం ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆ తర్వాత మరో యువకుడికి ఈ విషయం తెలిసింది. దీంతో అందరికీ చెబుతానంటూ బెదిరింపులకు దిగాడు. ఎవరికీ చెప్పకుండా ఉండాలంటే తాను చెప్పినట్లు వినాల్సిందేనని హెచ్చరించాడు. ఆపై అతను కూడా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా కొంత కాలం జరిగిన తర్వాత చిన్నారి గర్భం దాల్చింది. విషయం ఇంట్లో తెలియడంతో చిన్నారిని తల్లిదండ్రులు గట్టిగా నిలదీశాడు. దీంతో అసలు విషయాన్ని ఆమె వెల్లడించింది. వెంటనే పోలీసులను బాధిత తల్లిదండ్రులు ఆశ్రయించారు. తమ కుమార్తెకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిందితుల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. మరోవైపు యువకులు చేసిన పనికి గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించి చిన్నారుల మాన, ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

## నాగోబా ఆలయాన్ని దర్శించుకున్న కమిషన్ చైర్మన్

**ఆదిలాబాద్,జూలై17 :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా దేవాలయాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మెశ్రం వంశీయులు నాగోబా దేవాలయ చరిత్ర, మెశ్రం వంశీయుల సంప్రదాయాలు,నాగోబా జాతర విశిష్టత, గిరిజనుల ఆచార వ్యవహారాల గురించి వివరించారు. చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ నాగోబా దేవాలయం తెలంగాణ గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. నాగోబా జాతర దేశవ్యాప్తంగా గిరిజన సంస్కృతికి ప్రతిబింబమని, గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే గొప్ప వారసత్వమని పేర్కొన్నారు. గిరిజన సమాజం తమ మూలాలను, సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.కమిషన్ సభ్యులు ఆలయ పరిసరాలను పరిశీలించి, దేవాలయ విశిష్టత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

సరూర్ నరగ్ స్టేడియంలో సభ నిర్వహణ
పోలీసుల అనుమతి నిరాకరణతో హైకోర్టు అనుమతి

**హైదరాబాద్, జూలై 17 :** బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం నాడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇచ్చింది. సభ రోజు హైవేను బ్లాక్ చేయొద్దని విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని పేర్కొంది. పోలీసుల సూచనలు పాటించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాష్ట్ర యువతకు అనేక హామీలు ఇచ్చారని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు చెబుతున్నారు. ఆ సమయంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచే వారు యూత్ డిక్లరేషన్ ప్రకటించారని వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వాగ్దానాలను యువతకు ఇచ్చారని అంటున్నారు. నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గులాబీ నేతలు నిర్ణయించారు. అయితే, ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించగా.. తాజాగా వారి సభకు న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలిరావాలని గులాబీ నేతలు పిలుపునిచ్చారు. కాగా, ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# వాడీవేడీగా సాగనున్న పార్లమెంట్!



**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్వవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది.**

డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. ల

డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశా ల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది.

ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మొత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.

# బిల్లుల పాస్ కోసం బిజెపి వ్యూహం

- విపక్ష పార్టీలను బుట్టలో వేసుకునే యత్నం
- ఈసారి రాజ్యాంగ సవరణ వీగిపోతే బిజెపి పరువు పోయినట్లే



**న్యూఢిల్లీ, జులై 17 :** గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోవడంతో బిజెపి మరింత పట్టుదలగా అడుగులు వేస్తోంది. బిల్లులు ఆమోదింపచేసుకోవడానికి ఇదే సమయమని కమలనాథులు భావిస్తున్నారు. అయితే చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించేందుకు మాత్రం ఆ పార్టీ ముందుకు రావడం లేదు. గత సెషన్‌లో బిజెపి వ్యూహాత్మకంగా ఉందని అంతా భావించారు. కానీ ఓటింగ్ సమయంలో దానికి వ్యూహం లేదని తేలిపోయింది. ప్రతిపక్ష పార్టీలే ఓ రకంగా వ్యూహాత్మకంగా నిలిచి తమ పట్టును నిలబెట్టుకున్నాయి. దీంతో రాజ్యాంగ సవరణ బిల్లులు బలం లేకపోవడంతో వీగిపో యాయి. ఇప్పుడు మరోమారు ప్రయత్నంలో బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో లోక్‌సభ సీట్లను 2011 జనాభా లెక్కల ఆధారంగానే పెంచడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నెగ్గించుకోవాలన్న పట్టుదలతో భాజపా నాయకత్వం పనిచేస్తోంది. 2/3వ వంతు ఆధిక్యం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు వీగిపోవడం అధికారపక్షానికి ఇబ్బందికరంగా పరిణమించింది. తర్వాత ప్రతిపక్షం దూకుడు మొదలుపెట్టింది. ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తృణమూల్‌కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది వేరు కుంపటి పెట్టుకొని అధికారపక్షానికి మద్దతు పలికారు. ఇండియా కూటమితో డీఎంకే తెగదెంపులు చేసుకుంది. ఈ రెండు అవకాశాలను అనుకూలంగా మలచుకునే పనిలో భాజపా నాయకత్వం తలమునకలైంది. ఇదివరకు డీలిమిటేషన్ బిల్లులో సీట్లపెంపు ప్రతిపాదన ఉన్నా దానికి ప్రాతిపదికను పెట్టలేదు. ఈసారి అలాకాకుండా.. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్లను 50శాతం మేర పెంచుతామని, దానివల్ల లోక్‌సభలో ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుందని భరోసా ఇవ్వడానికి బిజెపి సమాయత్తమైంది. ఈ మార్పునకు ఇప్పటికే ఇండియా కూటమిలోని శరద్‌పవార్ పార్టీ ఆకర్షితమైంది. 50శాతం సీట్లు పెంచేలా బిల్లులో స్పష్టత ఇస్తే మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదని ప్రకటించింది. డీఎంకే కూడా వ్యతిరేకించకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భాజపా నాయకత్వం ఈ అంశంపై అన్ని పార్టీలతో తెరవెనుక మంత్రాంగం నెరపుతోంది. ప్రధానంగా డిఎంకె, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపిలను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. తృణమూల్ చీలిపోవడం, మరోపార్టీ ఇండియా కూటమికి దూరంగా ఉండటంతో తమకు ఇంతకంటే మంచి తరుణం రాదని భావించి.. మిగిలిన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను కమలనాథులు ముమ్మరం చేశారు. ఇప్పటికే భాజపా అత్యున్నత నాయకత్వం ప్రధానమంత్రి నివాసంలో దీనిపై చర్చించి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 సీట్లున్నాయి. తృణమూల్ నుంచి విడిపోయిన 20 మంది, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన నుంచి బయటపడిన ఆరుగురు ఎంపీలను కలిపితే ఆ సంఖ్య 319కి చేరనుంది. శరద్‌పవార్ పార్టీకి చెందిన 8 మంది మద్దతు లభిస్తే 327కి, డీఎంకే అండగా నిలిస్తే ఈ సంఖ్య 349కి చేరుతుంది. 2/3వ వంతు బలమైన 360ని చేరుకోవడానికి మరో 11మంది అవసరమవుతారు. వైకాపాకు చెందిన నలుగురు, ఒక స్వతంత్ర సభ్యుడు మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారు. అంటే ఇంకా ఆరుగురు తక్కువవుతారు. ఒకవేళ డీఎంకే గైర్హాజరైతే సభ సంఖ్యాబలం 518కి తగ్గుతుంది. అప్పుడు హాజరైనవారిలో 346 మంది మద్దతిస్తే చాలు. సభలోని 540 మంది హాజరైతేనే మెజార్టీకి 360 మంది అవసరం అవుతారు. మొత్తంగా బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేకపోతే బెడిసి కొడుతుందా అన్నది చూడాలి.

# మారుతున్న మహారాష్ట్ర రాజకీయం

**విలీనం దిశగా ఎన్సీపి వర్గాల చర్చలు**

**మరింత బలహీనంగా ఉద్ధవ్ శివసేన**



**ముంబై, జులై 17 :** మహారాష్ట్ర రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. అధికార ఎన్‌డిఎ తనకు అనుకూలంగా పరిస్థితులను మార్చుకుంటోంది. అలాగే ఎన్సీపిని బలోపేతం చేసి అంటే రెండు వర్గాలను కలిపి దగ్గరకు తీసుకోవాలని చూస్తోంది. శరద్ పవార్ కూతురు సుప్రియా సులఅఏకు మంత్రి పదవిఇ కట్టబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఇకపోతే ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన ఇప్పటికే బలహీన పడింది. ఇదంతా ఒక ఎత్తయితే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లో ఉత్కంఠ నెలకొనడంతో మహారాష్ట్ర రాజకీయం మరింత ముదురుతోంది. అధికార కూటమికి చెందిన అజిత్ పవార్ వర్గం ఎన్‌సీపీలో, శరద్ పవార్(ఎస్పీ) నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎస్‌పీ)లో అంతర్గత పరిణామాలు వేగంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో జరిగిన వరుస భేటీలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తెరతీస్తున్నాయి. ఎన్‌సీపీ సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే ఇటీవల సీఎం ఫడణవీస్‌ను కలవడం కూడా చర్చనీయాంశమైంది. ఆ మరుసటి రోజే డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కుమారుడు, ఎంపీ పార్థ్ పవార్ కూడా ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ భేటీలపై అధికారికంగా ఎలాంటి సమాచారం అందకపోయినా.. రాజకీయంగా మాత్రం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక.. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో తమకు ప్రాధాన్యం తగ్గిందనే అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ మరణానంతరం.. ఆయన సతీమణి సునేత్ర పవార్ పార్టీ బాధ్యతలు చేపట్టగా, కుమారుడు పార్థ్ పవార్ కూడా పార్టీ వ్యవహారాల్లో ఎక్కువగా కల్పించుకుంటుండంతో కొందరు సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే.. పార్టీని సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ప్రఫుల్ పటేల్ ఇటీవల బహిరంగంగా అనడం ఈ వాఖ్యలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మరోవైపు పార్టీ జాతీయ కార్యదర్శి సచ్చిదానంద్ సింగ్.. సునేత్ర పవార్‌ను పార్టీ అధ్యక్షురాలిగా నియమించడాన్ని ప్రశ్నిస్తూ, ఆ ఎన్నిక చెల్లదని బహిరంగంగా వ్యాఖ్యానించడమూ పార్టీలో అసంతృప్తిని బయటపెట్టింది. మరోవైపు.. ఎస్పీ వర్గానికి చెందిన సీనియర్ నేత జయంత్ పాటిల్ కూడా ఇదే సమయంలో సీఎం ఫడణవీస్‌ను కలవడం రాజకీయ చర్చలకు మరింత ఊతమిచ్చింది. ప్రత్యర్థి వర్గాలకు చెందిన ముగ్గురు కీలక నేతలు ఏకకాలంలో ఇలా సీఎంను కలవడం వెనుక రాజకీయ ప్రాధాన్యం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యితే.. ఈ సమావేశాలు పూర్తిగా పాలనా అంశాలకే సంబంధించినవని సునీల్ తట్కరే స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ కోణమేమీ లేదని, విలీనంపైనా ఎలాంటి చర్చ జరగలేదని ఆయన చెప్పారు. అజిత్ పవార్ జీవించి ఉన్న సమయంలోనే రెండు ఎన్‌సీపీ వర్గాల విలీనంపై చర్చలు జరిగాయని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనలేమీ లేవని పేర్కొన్నారు. మరోవైపు, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు శరద్ పవార్ వర్గానికి చెందిన కొందరు నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే శరద్ పవార్ వర్గం ఈ వార్తలను ఖండించింది. తమ పార్టీ ఇప్పటికీ ఇండియా కూటమితోనే కొనసాగుతోందని ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే స్పష్టం చేశారు. అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడకపోయినా, వరుస భేటీలు, పార్టీల్లో పెరుగుతున్న అసంతృప్తి, విలీనం లేదా రాజకీయ పునర్వ్యవస్థీకరణపై వినిపిస్తున్న ప్రచారం మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎలాంటి మలుపు తిప్పుతాయనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.



# యెమెన్ తీరంలో నౌకపై సముద్రపు దొంగల దాడి

**లండన్:** రసాయన నౌక 'అసనా'పై సముద్రపు దొంగలు దాడి చేశారు. ఈ ఘటన గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో దక్షిణ తీరానికి సమీపంలో చోటుచేసుకుంది. ప్రస్తుతం ఆ నౌక వారి అధీనంలోనే ఉందని బ్రిటన్ మారిటైమ్ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. ప్రాథమిక సమాచారం మేరకు.. సోమాలియా సముద్రపు దొంగలే దాడికి పాల్పడినట్లు భద్రతావర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది హూతీ తిరుగుబాటుదారుల పని కాకపోవచ్చని అభిప్రాయపడుతున్నాయి. అయితే, ఈ నౌకపై జాతీయ పతాకం లేకపోవడం వల్ల.. అది ఏ దేశానికి చెందిందన్న దానిపై స్పష్టత లేదు. మరోవైపు, 'అసనా' ట్యాంకర్‌లోని సిబ్బందికి సాయం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఆస్పైడ్స్ నేవీ మిషన్ అధికారి వెల్లడించారు. అసలేం జరిగిందనే విషయం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో మిషన్ ఆస్పైడ్ క్రియాశీలంగా ఉంటుంది. అసనా నౌకనుంచి శుక్రవారం అత్యవసర సందేశం వచ్చినట్లు బ్రిటిష్ మారిటైమ్ సెక్యూరిటీ గ్రూప్ వెల్లడించింది. ఈ ఘటన జరిగిన సమయంలో నౌకలో సాయుధ సిబ్బంది ఎవరూ లేనట్లు పేర్కొంది. నౌకను అపహరించిన దుండగులు సముద్రపు దొంగల ముఠాకు చెందిన వారై ఉండొచ్చని అభిప్రాయపడింది. దక్షిణ కొరియాకు చెందిన ఓ యుద్ధ నౌక కూడా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం.

# అమెరికా దాడులు చేస్తోంది.. తక్కువ విద్యుత్ వాడండి : ఇరాన్



**దుబాయ్:** పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. అమెరికా- ఇరాన్ పరస్పర దాడులతో ఆ ప్రాంతం భగ్గుమంటోంది. తాజాగా ఇరాన్ చేసిన ప్రకటన అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ ధ్రువీకరించింది. విద్యుత్ తక్కువగా వాడాలని దేశ పౌరులను కోరింది. ఈ మేరకు ఆ దేశ విద్యుత్ శాఖ వెల్లడించింది. ఇరుదేశాల మధ్య ఇటీవల మరోసారి ఉద్రిక్తతలు చెలరేగిన తర్వాత.. విద్యుత్ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ అంగీకరించడం ఇదే తొలిసారి. ముఖ్యంగా దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం కోరింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతోపాటు, విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని, ప్రజలు వీలైనంత తక్కువ విద్యుత్ వినియోగించాలని కోరింది. అయితే, తమ విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసిందా? సరఫరా లైన్లను ధ్వంసం చేసిందా? అనే దానిపై ఇరాన్ స్పష్టత ఇవ్వలేదు. హర్మూజ్ జలసంధిపై నియంత్రణ కోసం ఇరాన్‌తోపాటు అమెరికా పోటీపడుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇదివరకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దానిని నిజం చేస్తూ తాజాగా అమెరికా దళాలు.. ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తున్నాయి.

# జైషే మహ్మద్ టెర్రర్ మాడ్యూల్ ఛేదన


**ఉగ్రముఠాతో సంబంధం ఉన్న ఐదుగురి అరెస్ట్**

**గాంధీనగర్, జులై 17 :** ఉగ్రవాద అణచివేత చర్యల్లో భాగంగా గుజరాత్ పోలీసులు జైషే మహమ్మద్ టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించారు. పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న ఐదుగురిని అరెస్టు చేశారు. బిలాల్ అబిద్ షేరా, మహమ్మద్ అయూబ్ కడివాల్, మహమ్మద్ షఫీ ముఖి, మహమ్మద్ హసన్ కరాడియా, మహమ్మద్ సునాసరగా వారిని గుర్తించారు. న్యాయస్థానం వీరికి జులై 24 వరకు పోలీసు కస్టడీ విధించింది. ఇటీవల ఎనిమిది మంది జైషే అనుమానితులను గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అరెస్టు చేశారు. దేశంలో ఉగ్రకార్యకలాపాలు నిర్వహంచేందుకు ఒక నెట్‌వర్క్ కోసం వారు యత్నిస్తున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నప్పుడే ఈ ఐదుగురి పేర్లు బయటకు వచ్చాయి.

# ప్రేమను నిరాకరించిందని యువతి హత్య

**కర్నాటకలో యువకుడి దురాగతం**

**బెంగళూరు,జూలై17 :** తన ప్రేమను నిరాకరించిందని ఉన్మాదిగా మారిన యువకుడు.. రద్దీగా ఉండే బస్టాండ్‌లో యువతిని దారుణంగా హత్య చేశాడు. కర్నాటకలో ఈ దుర్ఘటన జరిగింది. బాధితురాలు లావణ్యకు నిందితుడు చేతన్ వరసకు బంధువు అవుతాడని సమాచారం. అతను కొంతకాలంగా లావణ్యను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండగా, ఆమె అతని ప్రేమను నిరాకరించింది. దాంతో పగ పెంచుకున్న చేతన్, బంట్వాల్‌లోని రద్దీగా ఉండే కేఎస్ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణికులు అందరూ చూస్తుండగానే లావణ్యపై దాడి చేసి ప్రాణాలు తీశాడు. బహిరంగ ప్రదేశంలో జరిగిన ఈ క్రూరమైన హత్య సంఘటన స్థానిక ప్రజలను షాక్‌కు గురి చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాల గురించి వివరాలను సేకరిస్తున్నారు. హత్య చేసిన వెంటనే దుండగుడు పారిపోయాడు. అతని కోసం అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు చేతన్‌ను త్వరగా గుర్తించి.. కఠినమైన శిక్షపడేలా చేస్తామన్నారు అధికారులు. బంట్వాల్ ప్రాంతంలో రద్దీగా ఉండే బస్టాండ్‌లో ఈ ఘటన చోటు చేసుకోవడంతో చర్చనీయాంశంగా మారింది.



# ఆండీ బర్న్‌హామ్‌కే బ్రిటన్ ప్రధాని పగ్గాలు

**లండన్:** బ్రిటన్ నూతన ప్రధాని ఎవరన్న దానిపై సందిగ్ధత వీడింది. అధికార లేబర్ పార్టీ పక్షనేతగా ఆండీ బర్న్‌హామ్ ఎన్నికయ్యారు. లండన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో లేబర్ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్ షబానా మహ్మద్ ఈ మేరకు ప్రకటించారు. 10 డౌనింగ్ స్ట్రీట్‌లో వచ్చే వారం ఆండీ బర్న్‌హామ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా కింగ్ ఛార్లెస్-3 సోమవారం బర్న్‌హామ్‌ను ఆహ్వానించనున్నారు. ఇటీవల కీర్ స్టార్మర్ ప్రధాని పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది.



## రోడ్డు విస్తరణలో బాధితులకు నష్టం జరగనివ్వం

**ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి, జూలై 17(జనం వార్త):** గంగారం గ్రామంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ హామీ ఇచ్చారు. శుక్రవారం గంగారం గ్రామంలోని శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం, శ్రీ పోచమ్మతల్లి అమ్మవారి దేవాలయం సమీపంలో రోడ్డు విస్తరణ అంశంపై బాధిత కుటుంబాలు, గ్రామ పెద్దలు, స్థానికులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ వల్ల ఎదురయ్యే ఇబ్బందులను బాధితులు వివరించగా, ప్రతి అంశాన్ని ఓర్పుగా విని చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ అభివృద్ధి పనులతో పాటు ప్రజల హక్కులు, ప్రయోజనాలను కూడా పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లిలో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

**వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**

**శేరిలింగంపల్లి, జులై 17 (జనం వార్త) :** రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మియాపూర్‌లోని శుభం బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ పార్టీకి అన్ని విధాలుగా సేవలందించినప్పటికీ తనకు తగిన గుర్తింపు, గౌరవం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి అండగా నిలుస్తూ ఎంతో మందికి సహాయం చేసినా తన సేవలను గుర్తించలేదని, అందుకే ఆ పార్టీని వీడి తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు తెలిపారు. గత పదేళ్లలో స్థానిక నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఇకపై తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామని, అన్ని డివిజన్లలో కమిటీలను ఏర్పాటు చేసి రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేస్తామని వెల్లడించారు. "ఇది కేవలం ఆరంభమే. త్వరలో పార్టీ కార్యాచరణను విస్తృతంగా అమలు చేస్తాం" అని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ పేర్కొన్నారు.



## రేణుక నారాయణకు ఘన సన్మానం


**శేరిలింగంపల్లి, జులై 17(జనం వార్త):** తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన గుంజ రేణుక నారాయణను శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, శేరిలింగంపల్లి వడ్డెర సంఘం అధ్యక్షుడు ముద్దంగుల తిరుపతి ఆధ్వర్యంలో నాయకులు ఆమెను నివాసంలో కలిసి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుంజ రేణుక నారాయణను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పార్టీ అధిష్ఠానానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ మంజల్కర్, శ్రామిక శక్తి అవార్డు గ్రహీత తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి, టిపిసిసి లేబర్ సెల్ వైస్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరమల్ల వీరేందర్ గౌడ్ శ్రమశక్తి అవార్డు గ్రహీత టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఏ బ్లాక్ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, శేరిలింగంపల్లి నియోజకవర్గం టిపిసిసి లేబర్ సెల్ అధ్యక్షులు ఎం.మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు తమ్మలి మాణిక్యం, బ్రహ్మానందం నాగరాజు, ఉయ్యూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్ స్కూల్ ఇస్లాం బోధన వ్యవహారం

**తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు**

**హైదరాబాద్, జులై 17 :** నగరంలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ స్కూల్లో వివాదాస్పద ఇస్లాం బోధనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్ ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించడం తీవ్ర సంచలనం రేపింది. క్లాస్ రూమ్‌లో సదరు బాలుడితో కల్మాలో భాగమైన సూరా అల్-ఫాతిహా పఠనం చేయాలని ఆదేశించడం తీవ్ర వివాదానికి దారితీసింది. రోజూ దానిని చదవాలంటూ స్కూల్ డైరీలో 'సూరా అల్ ఫాతిహా' అని రాసి ఒత్తిడి తెచ్చారని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రవర్తించడం వల్లే తమ కుమారుడు భయాందోళనకు గురై రోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల వల్ల తమ మత స్వేచ్ఛతో పాటు తల్లిదండ్రుల హక్కులకు భంగం కలిగిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సైదాబాద్ పోలీసులు ప్రాథమిక సమాచార నివేదిక నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**కూకట్ పల్లి టౌన్ ప్లానింగ్ విభాగానికి అవినీతి అధికారులు వచ్చి రావడంతోనే తమ వసూళ్ల పర్వాన్ని ప్రారంభించినట్లు ఆ సర్కిల్ లోని కింది స్థాయి సిబ్బందే చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంతో ఖర్చు చేసి కావాలని బదిలీ చేయించుకున్న ప్రాంతంలో ఆమాత్రం వసూళ్లు చేసుకుంటే తప్పేందని కింది స్థాయి సిబ్బందే చర్చించుకుంటున్నట్లు సమాచారం.**



# బదిలీపై రావడంతోనే వసూళ్లు

- ఆక్రమ షెడ్డు నిర్మాణంలో భారీ వసూళ్లు
- పెద్ద ఎత్తున చేతులు మారినట్లు సమాచారం
- అందిన కాడికి దండుకుంటున్న అవినీతి త్రిమింగలాలు
- ఆవినీతిలో కూరుకుపోయిన టౌన్ ప్లానింగ్ విభాగం



**కూకట్‌పల్లి, జూలై 17, (జనం వార్త) :** కెపిహెచ్ బి కాలనీ నాలుగవ ఫేస్‌లో 800 గజాలలో ఓ నిర్మాణ సంస్థ ఏలాంటి అనుమతులు లేకుండా యదేచ్చగా అక్రమ షెడ్డు నిర్మాణ విషయంలో అవినీతి అధికారులకు పెద్ద మొత్తంలో అందినట్లు తెలుస్తోంది.పనిర్మాణంలో ఉన్న అక్రమ నిర్మాణాలను సైతం వదలకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. కెపిహెచ్ బి కాలనీ నాలుగవ ఫేస్ లో 800 గజాలలో నిర్మిస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణం గురించి సంబంధిత టోన్ ప్లానింగ్ సెక్షన్ అధికారికి వివరణ కోరగా నిర్లక్ష్య పూరిత సమాధానం ఇవ్వడంతో పాటు తనకు సంబంధం లేదని తప్పించు కోవడం ఆ అధికారి తన విధి నిర్వహణలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడో అర్థం అవుతుంది. అడిగినంత అందడంతోనే అక్రమ షెడ్డు నిర్మాణం విషయంలో అవినీతి అధికారులు మౌనం వహిస్తున్నట్లు స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**తూతూ మంత్రంగా కూల్చివేతలు**

కెపిహెచ్ బి కాలనీ నాలుగవ ఫేస్ లో 800 గజాలలో నిర్మిస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణానికి సంబంధించి స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసే, అక్రమ నిర్మాణ దారుడికి ఎలాంటి నష్టం కలిగించకుండా టౌన్ ప్లానింగ్ అధికారులే తాము విధులు నిర్వహించినట్లు రికా ర్డుల కోసం తూతూ మంత్రంగా కూల్చివేసి, ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్న ఉ న్నతాధికారులకు తెలియదా అంటే... తిలా పాపం తలా పిడికెడు అన్న విధంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు అవినీతి గడ్డికి అలవాటు పడడంతో అందరూ అందిన కాడికి దండుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులకు అక్రమ నిర్మాణాలు చేపడితే పండగే. టౌన్ ప్లానింగ్ విభాగంలో అధిక శాతం ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో ఇప్పటివరకు ఏ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్న దాఖలు లేవు. ఫిర్యాదు వచ్చిందంటే అవినీతి అధికారులకు పండగే. ఫిర్యాదు దారు డికి అనుకూలంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణదారుడి వద్ద అంది నంత దండుకుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణదారుడికి స్థాయి లో పరిచయాలు కలిగి అవినీతి అధికారులకు ఆమ్యామ్యాలు అందిం చకుంటే కొందరు వ్యక్తులతో అవినీతి అధికారులే ఫిర్యాదు చేయించి అక్రమ నిర్మాణ దారుడి వద్ద ముక్కుపిండి అక్రమ వసూళ్లు కు పాల్పడుతున్నట్లు స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అవినీతి అధికారులపై ఇప్పటికైనా ఉ న్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- కలెక్టర్ మను చౌదరి
- జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులకు హామీ ఇచ్చిన కలెక్టర్



**కూకట్‌పల్లి, జూలై 17 (జనంవార్త) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే – ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజు,దొంతుల వెంకట్రాం రెడ్డిలతో పాటు జిల్లా అక్రిడేషన్ కమిటీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో జర్నలిస్టులుగా పని చేస్తున్న సీనియర్ రిపోర్టర్లందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జిల్లా టియుడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ నిబంధనలు పేరుతో కొంతమందికి ఇబ్బంది కలిగించకుండా అందరికీ కార్డులు అందించే విధంగా చూడాలని కోరారు. అక్రిడేషన్ కార్డుల జారీలో జాప్యం చేయకుండా,అందరికీ అందజేయాలని, దీనికి అక్రిడేషన్ కమిటీ సహకారం అందజేస్తుందని తెలిపారు. కమిటీ ప్రతినిధుల వినతి మేరకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని,త్వరలోనే జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, అక్రిడేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవి కిరణ్ రెడ్డి, డబ్ల్యూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూ సమస్య పరిష్కరించాలని బండి రమేష్‌కు వినతి



**కూకట్‌పల్లి, జూలై 17, (జనం వార్త) :** భూదాన్ భూ సమస్య పరిష్కరించి, 800 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని పీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ను లబ్ధిదారులు కలిసి విన్నవించుకున్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని భూదాన్ భూ సమస్యకు పరిష్కరించి, 800 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేస్తూ మూసా పేట్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ ను కలిసిన లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పలు విషయాలను బండి రమేష్ కు వివరించారు. పలువురు స్థానిక రాజకీయపహోయకులు ఐడిపియల్ ఉద్యోగులపహోఅండతో సుమారు 17 ఎకరాల భూదాన్ భూమిని కబ్జా చేసి హక్కుదారులను బెదిరిస్తున్నారని, హైకోర్టు క్లియర్ డైరేషన్స్ ఉన్నప్పటికీ అధికారులు కూడా ఒత్తిళ్లకు లొంగిపహోసమస్యపై దృష్టి సారించడం లేదని వాపోయారు. ఈ సమస్యను తెలుసుకున్న బండి రమేష్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎలాంటి అక్రమాలకు, ఒత్తిడులకు లొంగినాహొపై అధికారులకు పిర్యాదు చేస్తానని ఆయన అధికారులను హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేదాకాపహోరి పక్షాన నిలబడతానని బండి రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోపహొట్టి ముక్కల వెంకటేశ్వరరావు, ఖలీమ్ ఖాన్,ఫాల్గుణ రావు, చంద్రావు,వాసు, నారాయణ, ఆంజనేయులు, రఘువీర్, మల్లికార్జున్, వాణి, కనకమ్మ వజ్రం , భూదాన్ భూమి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## నల్లగండ్లలో యాక్సిస్ బ్యాంక్ కొత్త శాఖ ప్రారంభం

**శేరిలింగంపల్లి, జులై 17 (జనం వార్త):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్–2ను శుక్రవారం శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి శాఖను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో యాక్సిస్ బ్యాంక్ రెండో శాఖ ఏర్పాటు కావడం స్థానికులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. బ్యాంకింగ్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన ఆర్థిక సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్, పొదుపు పథకాలు, ఇతర ఆధునిక బ్యాంకింగ్ సేవలను సమ–ర్థవంతంగా అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ సర్కిల్ హెడ్ రవీంద్రనాథ్, క్లస్టర్ హెడ్ మధుసూదన్ గౌడ్, బ్రాంచ్ మేనేజర్ గడిరాజు కపర్తి, పురం విష్ణువర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్, రవి యాదవ్, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.అంజిరెడ్డి

**మేడ్చల్ :** మేడ్చల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా బి.అంజిరెడ్డి శుక్రవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ లోని తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. శేర్లింగంపల్లి ఎస్ఓటి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న ఆయన బదిలీపై మేడ్చల్ కు వచ్చారు. మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బి. అంజిరెడ్డి కేంద్ర హోం మంత్రి ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ మెడల్ – 2022 ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. గతంలో బి.అంజిరెడ్డి మేడిపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో (2020) నమోదైన ఒడిశాకు చెందిన ఒక వలస కార్మికుడి హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే, అంజిరెడ్డి అత్యంత వినూత్నంగా, చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి ఈ క్లిష్టమైన కేసును ఛేదించారు. ఈ కేసు దర్యాప్తులో ఆయన కనబరిచిన వృత్తిపరమైన నైపుణ్యం, విశేష కృషిని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం కేంద్ర హోంమంత్రి ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ మెడల్ – 2022 మెడల్‌ను ప్రకటించింది.



## కొల్లేరులో కాలుష్యంపై సుప్రీంకోర్టు కమిటీ ఆగ్రహం

**ఏలూరు, జులై 17 :** కొల్లేరులో కాలుష్యం పెరగడంపై సుప్రీంకోర్టు కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. కొల్లేరు లేక్ ప్రొటెక్షన్ కేసులో కలెక్టర్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్రమ చేపల చెరువుల ధ్వంసానికి అటవీశాఖకు సహకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. స్థానిక యంత్రాంగం సహకరించడం లేదని, కూల్చివేతలకు అడ్డు తగులుతున్నారని అటవీ పర్యావరణశాఖ.. కమిటీకి ఫిర్యాదు చేసింది. తక్షణమే రంగంలోకి దిగాలని ఏలూరు జిల్లా కలెక్టర్‌ను ఈ మేరకు కేంద్ర సాధికార కమిటీ ఆదేశించింది. మరోవైపు పక్షుల మనుగడ ప్రమాదంలో పడటంపై పిటిషనర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో కొల్లేరు సరస్సు కలుషితంపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని కమిటీ ఆదేశించింది. అక్రమ చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కూల్చివేతల పురోగతితో పాటు కాలుష్య నివారణ చర్యలపై నివేదిక సమర్పించాలని పేర్కొంది.

## ఈ యేడు పొగాకు సాగుపై పరిమితులు

### త్వరగా కొనుగోళ్లు పూర్తి చేసేలా బోర్డుపై ఒత్తిడి

### వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి, జులై 17 :** 2026–27లో పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. గత నాలుగు రోజులుగా కొనుగోళ్లు ఊపందుకున్నాయని... రోజుకు 8.5 లక్షల కిలోల పొగాకు కొనుగోలు జరుగుతోంద న్నారు. ప్రస్తుతం గరిష్ఠ ధర రూ.250గా ఉందని.. ధర మరింత పెరిగేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని టొబాకో బోర్డుకు మంత్రి సూచించారు. ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలపై సమావేశంలో చర్చించారు. కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతులకు మరింత మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందన్నారు. తక్కువ నాణ్యత గల పొగాకుకూ గిట్టుబాటు ధర లభించేలా కంపెనీలతో చర్చించాలని టొబాకో బోర్డు చైర్మన్, ఈడీకి మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు.

## గ్రేడ్-2 బీసీ హాస్టల్ వార్డెన్లకు శుభవార్త

### పదోన్నతుల సర్వీస్ రూల్స్ సడలిస్తూ ఉత్తర్వులు

**అమరావతి, జులై 17 :** గ్రేడ్–2 బీసీ హాస్టల్ వార్డెన్లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పదోన్నతుల కల్పనకు సర్వీస్ రూల్స్‌ను సడలిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 300 మందికి పైగా గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లు పదోన్నతులు పొందే అవకాశం ఉంది. గత కొంతకాలంగా సర్వీస్ రూల్స్ సడలించాలని గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లు ప్రభుత్వాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. 2008 నుంచి ఈ అంశంపై వార్డెన్లు సర్కార్‌కు విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రేడ్ 2 హాస్టల్ వార్డెన్లకు ఉపశమనం లభించినట్లైంది. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సవితకు గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లు ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం

### ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

**హైదరాబాద్, జులై 17 :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున ఓఆర్‌ఆర్‌పై జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపక్కన నిలిపి ఉన్న ట్రాలీ ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులు రాములు (60), రషీద్ (40)గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే కీసర పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతులిద్దరూ మెదక్ జిల్లా వాసులుగా తెలుస్తోంది. ట్రాలీ ఆటోను ఢీకొట్టిన అనంతరం గుర్తుతెలియని వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తల్లీ కొడుకు మధ్య వాగ్వాదం

### క్షణికావేశంలో కర్రతో తండ్రి దాడి : కొడుకు మృతి



**మచిలీపట్నం, జులై 17 :** మచిలీపట్నంలోని మంగినపూడి బొట్లవానిపాలెంలో దారుణం జరిగింది. క్షణికావేశంలో కన్నకొడుకుపై తండ్రి కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన కొడుకు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రామ్మోహన్ రావు అనే వ్యక్తి బొట్లవానిపాలెంలో భార్య, కొడుకు కళ్యాణ చక్రవర్తి(30)తో కలిసి జీవిస్తున్నారు. అయితే గత రాత్రి తల్లి, కొడుకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య గొడవ తీవ్రస్థాయికి చేరడంతో వారికి సర్ది చెప్పేందుకు రామ్మోహన్ రావు యత్నించాడు. ఎంతకీ గొడవ ఆపకపోవడంతో క్షణికావేశంలో పక్కనే ఉన్న కర్రతో కుమారుడిపై తండ్రి దాడి చేశాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఘటనాస్థలంలోనే చక్రవర్తి చనిపోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తండ్రి చేతిలో కొడుకు దుర్మరణం చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## ప్రియుడు మోసం చేశాడంటూ

# యువతి ఆత్మహత్య

### యువకుడి ఇంటిముందు శవంతో బంధువుల ధర్నా



**ఒంగోలు, జూలై 17 :** ఎనిమిదేళ్లుగా ప్రేమిం చిన యవకుడు మోసం చేయడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తట్టుకోలేకపో యింది. తనను కాదని వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో బాధిత కుటుంబసభ్యులు ప్రియుడు ఇంటి ముందు ఆందోళనకు దిగారు. మృతురాలి మెడలో తాళికట్టి న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. ఏపీలోని ప్రకాశం జిల్లా టంగు టూరు మండలం పొందురులో ఈ ఘటన చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా ప్రత్తి పాడు మండలం చినకొండ్రుపాడు గ్రామా నికి చెందిన అడ్డగళ్ల కీర్తి (24) ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఖతార్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పొందూరుకు చెందిన పాపినేని సాయి అనే యువకుడితో 8 ఏళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారడంతో పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నారు. అయితే వారం కిందట సాయికి అతని కుటుంబసభ్యులు వేరే అమ్మాయితో పెళ్లి నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన కీర్తి ముంబై నుంచి నాలుగు రోజుల కిందట ఒంగోలు వచ్చి సాయి తల్లిదండ్రు లను కలిసింది. సాయితో వివాహం చేయాలని కోరింది. అయితే అందుకు సాయి కుటుంబసభ్యులు నిరాకరించారు. అంతేకాకుండా బెదిరింపులకు దిగారు. దీంతో సాయిని మరిచిపోవాలని ఆమె తల్లిదండ్రులు నచ్చజెప్పారు. అనంతరం కీర్తి ముంబైకి వెళ్లిపోయింది. ప్రియుడు చేసిన మోసాన్ని తట్టుకోలేక ఈ నెల 14వ తేదీన ముంబైలో ఉరేసుకుంది. ఈ ఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కీర్తి కుటుంబ సభ్యులకు గురువారం అప్పగిం చారు. కీర్తి సూసైడ్‌తో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె కుటుంబస భ్యులు, బంధు వులు పొందూరులోని సాయి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. కీర్తి మృతదేహాన్ని ఇంటి వరండాలో ఉంచి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. సాయి చేత మృతురాలి మెడలో తాళి కట్టిం చి, అంత్యక్రియలు నిర్వహించాలని పట్టుబట్టారు. ఆ సమయంలో సాయి ఇంట్లో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న టంగుటూరు పోలీసులు వచ్చి దీనిపై సాయి బంధువులు, కీర్తి బంధువులతో చర్చించారు. అనంతరం సాయి బంధువులు కలగజేసుకుని తమ సంప్రదాయం ప్రకారం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, కీర్తి ఆత్మహత్య గురించి తెలుసుకుని సాయి ఖతార్‌కు వెళ్లిపోయాడని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది.

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను

# అస్తవ్యస్తం చేసిన వైసిపి

### మోడీ ఆశిస్సులు, నిర్మలా సీతారామన్ సహకారంతో గట్టెక్కాం

### బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్



**పల్నాడు, జులై 17 :** రాజకీయాల కోసం ఈ ప్రాంతంలో వైషమ్యాలు పెంచిన వాళ్లను గతంలో చూశామని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఒకే రోజున రూ.3 వేల కోట్లను కూటమి ప్రభుత్వం అందించిందని తెలిపారు. శుక్రవారం నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబుతో పాటు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కూటమి వచ్చిన రోజున ఏ పని చేయాలన్నా ఖజానాలో డబ్బు లేని పరిస్థితి ఉండేదని అన్నా రు. ప్రధాని మోదీ ఆశీస్సులు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారా మన్ ఆలోచనలతో ఏపీ ఇప్పుడు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. ఒక మహిళ ఇంటిని ఎలా తీర్చిదిద్దుతుందో అంతకంటే మెరుగ్గా నిర్మలా సీతారామన్ పని చేస్తున్నారని కొనియాడారు. '2024లో మీరు వేసిన ఒక్క ఓటు వల్లే అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, తల్లికి వందనం, ఉచిత బస్సు, గూగుల్ వంటి కంపెనీలు రాక సాధ్యమైంది' అని చెప్పుకొచ్చారు. ఏపీకి ఏ కష్టం వచ్చినా నిర్మలా సీతారామన్ గుమ్మం తలుపు తట్టి సాయం అడుగు తున్నామన్నారు. రాష్ట్రం కోసం ఏం అడిగినా కాదనకుండా పని చేస్తున్నారని తెలిపారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నిర్మలమ్మ చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజే శారు. ఎన్డీయే ప్రభుత్వం రేయింబవల్లు రాష్ట్రం కోసం పని చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి కేంద్ర పథకాలు చేరాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు అన్నారు. మహిళలు, యువత, వ్యాపారాలకు భారీగా రుణాలు ఇస్తున్నామన్నారు. మొదటిసారిగా ట్రాన్స్‌జెం డర్లకు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అటవి సాగుహక్కు పట్టాలు పొందిన గిరిజనులకు కూడా రుణాలు అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకుల్లో ఉన్న డ్వాక్రా సంఘాల డిపాజిట్లకు వడ్డీ చెల్లించాలని.. డ్వాక్రా సంఘాల వారితో 25 మండలాల్లో 25 మెగావాట్ల సౌరవిద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర మంత్రిని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు.

# అడవి ఏనుగు పట్టివేత

### ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన అటవీ సిబ్బందికి పవన్ అభినందనలు



**పలమనేరు, జులై 17 :** గత కొంత కాలంగా పలమనేరు పరిసరాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తూ, సమీప గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఒంటరి మగ అడవి ఏనుగును ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ విజయవం తంగా బంధించింది. ఈ ఏనుగును బంధించేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు క్షేత్ర స్థాయి సిబ్బంది నెల రోజులకుపైగా చెమటోడ్చాల్సి వచ్చింది. సుమారు 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ ఏనుగును వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు లోబడి, పశు వైద్య నిపుణులు, అటవీశాఖ ఫీల్డ్ సిబ్బంది పర్యవేక్షణలో బంధించారు. బుధవారం నిర్వహించిన తుది ఆపరేషన్లో ముసలమడుగు క్యాంపు నుంచి వచ్చిన ఐదు కుంకీ ఏనుగులు కూడా పాల్గొని, ఏనుగుని బంధించడంలో కీలకపాత్ర పోషించాయి. గతంలో ఈ ఏనుగు దాడిలో గాయపడిన అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీ సుకుమార్ కూడా ఈ ఆపరేషన్ లో పాల్గొనడం గమనా ర్హం. అత్యంత చాకచక్యంగా ఆపరేషన్ నిర్వహించి విజయవం తంగా పూర్తి చేసిన పీసీసీఎఫ్ శ్రీ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సిబ్బందిని, అనంతపురం సర్కిల్ కన్జర్వేటర్ శ్రీమతి యశోదా బాయ్, చిత్తూరు జిల్లా అటవీ అధికారితో పాటు పశువైద్య నిపుణులు, ట్రాకర్లు, మహౌత్ లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అభినందించారు. గతంలో ఏనుగు దాడిలో గాయపడినప్పటికీ, కోలుకుని ఈ ఆపరేషన్లో పాల్గొన్న శ్రీ సుకుమార్ ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. ప్రజల భద్రత, వన్యప్రాణి సంరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అటవీశాఖ చేపట్టిన ఆపరేషన్ ను ప్రశంసించారు. పట్టుకున్న ఈ ఏనుగును ముసలమడుగు క్యాంపుకి తరలిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలుపగా, కుంకీగా శిక్షణ ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు. ఈ ఏనుగు పలమనేరు సమీప ప్రాంతాల్లో సంచరిస్తూ పదే పదే పంటలను ధ్వంసం చేయడంతోపాటు పరిసర గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. పలుమార్లు జనావాసాల మధ్యకు రాగా, గతంలో చేపట్టిన మళ్లింపు చర్యల్లో పలమనేరు అటవీ విభాగానికి చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీ సుకుమార్ పై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చింది. పంటలకు నష్టం కలిగించడం, ప్రజల భద్రత దృష్ట్యా ఈ ఒంటరి మగ ఏనుగును బంధించాల్సి వచ్చింది. అందుకోసం సుదీర్ఘకాలం ఏనుగు కదలికలను క్షేత్ర స్థాయి అటవీ సిబ్బంది, ట్రాకర్ల సాయంతో పర్యవేక్షించారు. అప్పట్లో అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసినా తర్వాత ఏనుగు ప్రవర్తనలో మార్పు రావడాన్ని గుర్తించారు. ఏనుగుకు మత్తుమందు ఇచ్చే ప్రక్రియను డాక్టర్ నవీన్, అరుణ్ లు సమన్వయం చేయగా, విశ్రాంత ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ రఘునాథ్ ఆపరేషన్ అనంతర కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించారు. అనంత సర్కిల్ కన్జర్వేటర్ ఆపరేషన్ ను స్వయంగా పర్యవేక్షిస్తూ కీలక సూచనలు ఇచ్చారు. ఉపముఖ్యమంత్రివర్యుల సూచన మేరకు పట్టుకున్న ఏనుగును ముసలమడుగు కుంకీ శిబిరానికి తరలించారు. అక్కడ పశువైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఏనుగు ప్రవర్తనను కొంతకాలం పర్యవేక్షిస్తారు. మనుషులతో మెలిగే అంశంలో సానుకూల దృక్పథం కనబరిస్తే ప్రత్యేక శిక్షణ ఇచ్చి కుంకీగా తీర్చిదిద్దుతారు.



## నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు ఘనస్వాగతం

**అమరావతి, జులై 17 :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మిలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తమ నివాసానికి వచ్చిన నిర్మాలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సాదర స్వాగతం పలికారు. భేటీ అనంతరం ఆయనతో కలిసి నరసరావుపేట పర్యటనకు బయలుదేరారు. నరసరావుపేట లో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఇచ్చిన అంబులెన్సులను జెండా ఊపి ప్రారంభించారు. బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసారు. వివిధ రంగాల్లోని లబ్దిదారులకు రుణ వితరణ కార్యక్రమంలో భాగంగా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంకు హాజరయ్యారు.



## మాది ఇన్వెస్టర్ల ఫ్రెండీ ప్రభుత్వం

### రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**అమరావతి, జులై 17 :** భారత్ టెక్స్ –2026 ఈవెంట్ లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మొదటి రోజు బిజీగా గడిపారు. పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలు దారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల రాకకు, పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, ఇన్వెస్టర్లకు ఫ్రెండీ ప్రభుత్వమని తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామంటూ, ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సవిత కోరారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల కొనుగోలుకు సంబంధించి పలు ఆర్డర్లు సైతం చేనేత, జౌళి శాఖకు వచ్చాయి. ఈ నెల 14 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శన భారత్ టెక్స్ –2026 ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ టెక్స్ ఈవెంట్లో రాష్ట్రానికి చెందిన టెక్స్ టైల్స్ ఉత్పత్తుల అమ్మకాలే లక్ష్యంగా మంత్రి సవిత రెండ్రోజుల పర్యటనకు గురువారం ఢిల్లీ చేరుకున్నారు. మొదటి రోజు పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన వివిధ ప్రాంతాల చేనేత వస్త్రాల ప్రాముఖ్యత తో పాటు ఆయా వస్త్రాల తయారీలో కలంకారీ నైపుణ్యం వినియోగంపైనా వారికి వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత వివరించారు. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఏపీకే తరలొస్తున్నాయన్నారు.

### మంత్రి సవిత వరుస భేటీలు

భారతదేశ అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శనకు విచ్చేసిన మంత్రి సవిత పలువురు పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. అరవింద్ ఫ్యాబ్రిక్ సీఈవో డాక్టర్ పరమ్ షా, భారత్ టెక్స్ 2026 ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నరేన్ గోయెంకాతో పలు అంశాలపై చర్చించారు. వారితో పలువురు విదేశీ కొనుగోలుదారులతోనూ చర్చలు జరిపారు. రెండోరోజు శుక్రవారం కూడా మంత్రి సవిత భారత్ టెక్స్ ఈవెంట్ లో పాల్గొనబోతున్నారు. సాయంత్రం ఢిల్లీలో ఆధునీకరించిన లేపాక్షి షో రూమ్ ను మంత్రి సవిత ప్రారంభించనున్నారు. అంతకు ముందు ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి సవితకు కేంద్ర హ్యాండ్లూమ్ ఎక్స్ పోర్ట్ ప్రోమోషనల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్, ఏపీహెచ్డీసీ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాదరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు ఘన స్వాగత పలికారు.

## కోనసీమ జిల్లాలో మంత్రి నిమ్మల పర్యటన


### సాగునీటి వ్యవస్థపై బైక్‌పై ప్రయాణిస్తూ పర్యవేక్షణ

**అంబేద్కర్ కోనసీమ, జులై 17 :** జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి నిర్వహణను పర్యవేక్షించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బైక్‌పై ప్రయాణించారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని గోదావరి సెంట్రల్ డెల్టా కాలువల వెంబడి ఆయన పర్యటన సాగింది. ఈ సందర్భంగా లాకుల నీటిమట్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపేట నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి నల్ల లాకులను తనిఖీ చేశారు. 70 ఏళ్ల చరిత్రలో జులై నెలలో గోదావరి నదికి ఇంత తక్కువ ఇన్‌ఫ్లో రావడం ఇదే మొదటిసారని ఈ సందర్భంగా మంత్రి నిమ్మల పేర్కొన్నారు. 70 శాతం కాలువలు, 30 శాతం వర్షాలపై ఆధారపడి డిజైన్ చేసిన డెల్టాలో ప్రస్తుత పరిస్థితుల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా కాకినాడ రూరల్, అమలాపురం, ముమ్మిడివరం శివారు ప్రాంతాల్లో ఉన్న నీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టి, ప్రతి చుక్కనూ పొదుపు చేసేలా అధికారులు, రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ ఇరిగేషన్ అధికారులు నిరంతరం కాలువలను పర్యవేక్షిస్తూ.. రెవెన్యూ, నీటి సంఘాల సమన్వయంతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి నిర్వహణను విజయవంతం చేయడం ద్వారా ఎల్‌నినో సవాలును అధిగమించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

# భారీ లాభాల్లో మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు న్నా.. ప్రైవేట్ బ్యాంక్, ఐటీ, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా షేర్లలో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 950కి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,370.77 (క్రితం ముగింపు 77,186.87) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 78,282.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 964.58 పాయింట్ల లాభంతో 78,151.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.55 పాయింట్ల లాభంతో 24,334.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.28గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా, టీసీఎస్, రిలయన్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, ట్రెంట్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండిగో షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 85.96 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,996 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## త్వరలో పాలిమర్ నోట్లు..

### పైలట్ ప్రాజెక్ట్‌కు ఆర్‌బీఐ సన్నాహాలు

మార్కెట్‌లోకి త్వరలో పాలిమర్ నోట్లు రంగ ప్రవేశం చేయనున్నాయి. కొత్త తరహా కరెన్సీని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సన్నాహాలు చేస్తోంది. 2027 నాటికి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నది ఆర్‌బీఐ ఆలోచనగా ఉందని ఎన్డీటీవీ ప్రాఫిట్ తన కథనంలో పేర్కొంది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలుత రూ.10, 20 విలువైన బ్యాంక్ నోట్లను ఆర్‌బీఐ వినియోగంలోకి తీసుకురానుంది. వీటిపై అభిప్రాయాలను సేకరించి పూర్తి స్థాయిలో 2027 నుంచి వినియోగంలోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. పాలిమర్ నోట్లు వచ్చినప్పటికీ.. పేపర్ కరెన్సీ ఎప్పటిలానే కొనసాగుతుంది. దశలవారీగా పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి చలామణీకి రానున్నాయి. పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల వెల్లడించారు. ఈ కొత్త తరహా కరెన్సీ నోట్లను ముద్రించడానికి ఉపయోగించే ప్రత్యేకమైన పదార్థమైన పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల తయారీ, సరఫరా కోసం ఆర్‌బీఐ నోట్ల ముద్రణా విభాగం గ్లోబల్ ఆసక్తి వ్యక్తీకరణను జారీ చేసింది. ఆగస్టు 18 నాటికి బిడ్లు దాఖలు చేయాలని సూచించడం ఈ వాదనలనకు బలం చేకూర్చింది. నకిలీ నోట్లను అరికట్టడం, కరెన్సీ నోట్ల మన్నికను పెంచడం ఈ పాలిమర్ నోట్ల ముఖ్య ఉద్దేశం. ఇవి తడిని తట్టుకోగలవు. చిరిగి పోవడం, నల్లగా మారడం వంటి సమస్యలు ఉండవు. ఆస్ట్రేలియా, కెనడా, యూకే, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఇప్పటికే పాలిమర్ నోట్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు.




## ఆటగాళ్లపై చర్యల కంటే.. సాంకేతిక అంశాలపై దృష్టిపెట్టాలి

### బీసీసీఐకి గావస్కర్ సలహా

టీ20ల్లో అత్యుత్తమ జట్టుగా పేరొందిన టీమ్‌ఇండియా.. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లపై వరుసగా ఘోర ఓటమి చవిచూడటం అందర్నీ ఆశ్చర్యపర్చింది. జట్టు ఎంపిక, ఆటగాళ్ల వైఫల్యాలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తోన్న వేళ.. ఈ పరాజయాలపై బీసీసీఐ సమీక్షకు సిద్ధమైంది. జట్టుకు సంబంధించి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తాజాగా స్పందించారు. ఈ సమయంలో ఆటగాళ్లపై చర్యల కంటే.. ఎక్కువగా సాంకేతిక అంశాలపై బోర్డు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. "వరుసగా రెండు టీ20 సిరీస్‌ల్లో ఓటమిపై బీసీసీఐ రివ్యూ చేపట్టనుంది. ఈ సమీక్షలో కొందరు ఆటగాళ్లపై వేటు లేదా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అది జరిగితే మేనేజ్‌మెంట్ తీవ్రమైన నిర్ణయం తీసుకున్నట్లే. కేవలం నాలుగు నెలల కిందటే టీమ్‌ఇండియా పొట్టి కప్ గెలిచి ఛాంపియన్‌గా అవతరించింది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ ఇప్పటికీ ప్రపంచ నంబర్-2గా కొనసాగుతోంది" అని గావస్కర్ గుర్తు చేశారు. "ఫ్లాట్ పిచ్‌లపై ఆడటం.. భారత బ్యాటర్లను దెబ్బతీసిందనే విషయంపై చాలా చర్చ జరిగింది. కానీ, ఐపీఎల్‌లో ఫ్లాట్ పిచ్‌లపైనా.. చాలా మంది భారత బ్యాటర్లు షార్ట్ బాల్‌ను ఎదుర్కోవడానికి ఇబ్బంది పడ్డారు. ఇది పూర్తిగా సాంకేతిక వైఫల్యమనే అనిపిస్తోంది. ఇక, చిన్న బౌండరీలు కూడా మన జట్టు ఓటములకు కారణమవుతున్నాయి. దేశీయంగా జరిగిన టీ20 మ్యాచ్‌ల్లో బ్యాటర్లు కొట్టిన సిక్స్‌ల్లో చాలా వరకు బౌండరీ లైన్‌కు కొంత దూరం వెలుపలే పడ్డాయి. ఇవే.. విదేశీ గడ్డపై క్యాచ్‌లుగా మారుతున్నాయి. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌నకు సిద్ధమవుతున్న వేళ.. బీసీసీఐ ఈ విషయంపై అత్యవసరంగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. భారత్‌లో ప్రతి మైదానంలో బౌండరీల పొడవును పెంచే అవకాశం ఉంది. కానీ, అలా చేసేందుకు బీసీసీఐ సుముఖత చూపిస్తుందా? అన్నదే ప్రశ్న. త్వరలోనే అది జరగాలని కోరుకుంటున్నా" అని గావస్కర్ వివరించాడు.

## ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌కు రిఫరీగా విన్సిచ్



వరుసగా రెండోసారి ఫిఫా ప్రపంచ కప్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న అర్జెంటీనాను ఇప్పుడొక విషయం కలవరపెడుతోంది. అదేమీ ప్రత్యర్థి స్పెయిన్ జట్టుతో కాదు సుమా.. మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహించనున్న స్లోవ్కో విన్సిచ్‌తోనే అసలైన తంటా వచ్చి పడింది. ఎందుకంటే గతంలో ఆయన రిఫరీగా ఉన్న మ్యాచ్‌లో అర్జెంటీనా ఓటమిని చవిచూసింది. ఇప్పటి వరకు ఈ ప్రపంచ కప్‌లో మ్యాచ్ నిర్వాహకులు, రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా ఉన్నారనే వాదన నేపథ్యంలో ఫిఫా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ప్రపంచ కప్ ఫైనల్ కోసం ఫిఫా నియమించిన 47 ఏళ్ల స్లోవ్కో విన్సిచ్ స్లోవేకియాకు చెందిన రిఫరీ. 2010 నుంచి ఈ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. 2022 ఖతార్ వేదికగా జరిగిన ప్రపంచ కప్‌ను అర్జెంటీనా గెలుచుకున్న సంగతి తెలిసిందే. అయితే, లీగ్ స్టేజ్‌లో అర్జెంటీనాకు సౌదీ అరేబియా చేతిలో ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌కు విన్సిచ్ రిఫరీగా బాధ్యతలు నిర్వహించారు. తొలుత అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వడంతోపాటు సౌదీ అరేబియా ఆటగాళ్లకు ఆరు యెల్లో కార్డులు చూపించారు. దీంతో ఈయన కూడా అర్జెంటీనాకు అనుకూలమేనని వార్తలు వచ్చాయి. కానీ, రెండో సగంలో పరిస్థితి మారిపోయింది. వరల్డ్ కప్‌లో సౌదీ అరేబియా 2-1 తేడాతో అర్జెంటీనాను ఓడించింది. ప్రస్తుతం విన్సిచ్ మరోసారి ఫైనల్‌కు వస్తుండటంతో మెస్సి నాయకత్వంలోని అర్జెంటీనా శిబిరంలో గుబులు రేగుతోంది. ఫైనల్ మ్యాచ్‌కు తనను రిఫరీగా ఫిఫా ప్రకటించడంతో విన్సిచ్ భావోద్వేగానికి గురయ్యారు. సహచరులు కంగ్రాట్స్ చెబుతుండగా కన్నీటిపర్యంతమయ్యారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రపంచ కప్‌లో ఇప్పటి వరకు మూడు మ్యాచులకు రిఫరీగా వ్యవహించారు. ఓ మ్యాచ్‌లో ఈక్వెడార్ ఆటగాడు పీర్రో హిన్‌కేపీకి రెడ్ కార్డు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మైదానంలో దూకుడుగా ఉండే అర్జెంటీనా ఆటగాళ్లు రిఫరీతో జాగ్రత్తగా ఉండాలనేది నిపుణుల సూచన. ఏమాత్రం హద్దు దాటినా విన్సిచ్ ఉపేక్షించరని పేరుంది. మరోవైపు స్పెయిన్ ఆడిన చాలా మ్యాచులకు ఆయన రిఫరీగా వ్యవహించిన అనుభవం ఉంది. ఇది కూడా అర్జెంటీనా శిబిరాన్ని కలవరానికి గురి చేసే అంశమే. మరి ఫైనల్ మ్యాచ్‌ను విన్సిచ్ ఎలా నిర్వహిస్తారో చూడాలి మరి..

# రోహిత్‌పై ఒత్తిడి లేదు

### రిటైర్మెంట్ వార్తల వేళ బ్యాటింగ్ కోచ్

**టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేలకు రిటైర్మెంట్ పలుకుతాడా? ప్రస్తుతం నెట్టింట ఇదే చర్చ. ఇంగ్లాండ్‌తో సిరీస్ తర్వాత ఈ ఫార్మాట్ నుంచి వైదొలగాలని బీసీసీఐ అతడికి పరోక్షంగా అల్టిమేటం ఇచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే లక్ష్యంతో ఉన్న రోహిత్.. కేవలం ఈ ఒక్క ఫార్మాట్‌లోనే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటాక్ స్పందించారు. 'రిటైర్మెంట్' విషయంలో రోహిత్‌పై మేనేజ్‌మెంట్ ఎలాంటి ఒత్తిడి పెట్టట్లేదని స్పష్టం చేశారు. అసలేం జరిగిందంటే..**



ఇంగ్లాండ్‌తో ఆదివారం జరిగే చివరి వన్డేనే రోహిత్‌కు ఆఖరిదంటూ వార్తలు వస్తున్నాయి. "ఈ సిరీస్ తర్వాత వన్డేలకు అతడిని ఎంపిక చేసే అవకాశాల్లేవు. అయితే, భవిష్యత్తుపై అతడే నిర్ణయం తీసుకోవాలి. రిటైర్ కావాలని అతడికి ఎవరూ చెప్పరు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే బీసీసీఐ ప్రతినిధులతో రోహిత్ సమావేశమయ్యాడని.. బోర్డు నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశాడని సమాచారం. ఈ పరిణామాలపై బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటాక్ స్పందించారు. "రోహిత్ శర్మ లాంటి సీనియర్ ఆటగాడిపై ఇలాంటి ఒత్తిడి ఉంటుందని నేను అనుకోను. అతడు కూడా ఒత్తిడి ఉందని ఫీలయ్యే ఆటగాడు కాదు. నిజమే.. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో తొలి రెండు వన్డేల్లో అతడు పరుగులేం చేయలేదు. అంతమాత్రాన.. అతడి కెరీర్ విషయంలో పెద్ద తేడా ఏం ఉండదు. రోహిత్ ఇబ్బంది పడుతున్నాడని నేను చెప్పను. బహుశా షాట్ల ఎంపిక పనిచేయక పోవచ్చు. లార్డ్స్‌లో జరిగే మూడో వన్డేల్లో తప్పకుండా అతడి నుంచి భిన్నమైన ఇన్నింగ్స్‌ను మనం చూస్తాం" అని కోచ్ వివరించారు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో రోహిత్ ఆకట్టుకోలేకపోయాడు. తొలి వన్డేలో 11 పరుగులు చేసిన అతడు.. రెండో వన్డేలో 47 బంతులు ఎదుర్కొని 26 పరుగులకు ఔటయ్యాడు. గత ఎనిమిది వన్డే మ్యాచ్‌ల్లో 30.1 సగటుతో కేవలం 241 పరుగులు చేశాడు. వచ్చే ఏడాది ప్రపంచకప్‌లో రోహిత్‌ను ఎంపిక చేస్తారా? లేదా అన్న సందిగ్ధత వేళ.. ఈ రిటైర్మెంట్ వార్తలు చర్చనీయాంశమయ్యాయి.

# ఫిఫా ఫైనల్స్‌కు హాజరుకాను

### అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ



ఫిఫా ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. స్పెయిన్, అర్జెంటీనాల మధ్య జరిగే మ్యాచ్ కోసం ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. అయితే.. తాను ప్రపంచ కప్ ఫైనల్ పోటీలకు హాజరుకానని.. ఇంటి నుంచే చూస్తానని అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ పేర్కొన్నారు. ఓ సెంటిమెంట్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రపంచ కప్ మ్యాచ్‌లలో తమ జట్టు ఓడిపోకుండా ఉండడం కోసం.. దేశాధ్యక్షులు ఆయా మ్యాచ్‌లకు హాజరుకారని జేవియర్ మిలీ పేర్కొన్నారు. ఈ సెంటిమెంట్‌ను అక్కడి నేతలు 1990 తర్వాత నుంచి పాటిస్తున్నారు. అప్పుడు అర్జెంటీనా అధ్యక్షుడిగా ఉన్న కార్లోస్ మెనెమ్ .. తమ జట్టు ఆడే మ్యాచ్‌కు హాజరయ్యారు. ఆయన వచ్చిన కొద్ది క్షణాలకే అర్జెంటీనా అనూహ్యంగా ఓటమి చవిచూసింది. దీంతో అప్పటి నుంచి ఆ దేశాధినేతలు తమ జాతీయ జట్ల మ్యాచ్‌లకు హాజరుకావడం మానేశారు. అర్జెంటీనా విజయం సాధించిన గత ఏడు మ్యాచ్‌లను టీవీలోనే చూశానని జేవియర్ మిలీ తెలిపారు. అంతే కాకుండా మ్యాచ్ సమయంలో ఎంత వేడిగా అనిపించినా తాను ఓ బరువైన జాకెట్‌ను ధరిస్తానని తెలిపారు. గతంలో స్విట్జర్లాండ్‌తో అర్జెంటీనా మ్యాచ్ జరుగుతున్న సమయంలో తనకు ఉక్కపోతగా అనిపించి ఆ జాకెట్ తీసేశానని.. వెంటనే ప్రత్యర్థి జట్టు గోల్ చేసినట్లు తెలిపారు. దీంతో మ్యాచ్ జరిగే సమయంలో ఇంకెప్పుడూ దానిని తీయలేదన్నారు. తానే కాకుండా దేశ ప్రజలు కూడా జాతీయ జట్ల మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు పలు సెంటిమెంట్లు పాటిస్తారని అర్జెంటీనా అధ్యక్షుడు పేర్కొన్నారు. వీటిని తాము 'కాబాలాస్' అని పిలుస్తామన్నారు.

# ఫార్మాట్ మార్పుతో వరల్డ్ కప్‌లో ఆడాలనుకునేవారికి నష్టం : డబ్ల్యూసీఏ



వన్డే ప్రపంచ కప్ 2027 ఫార్మాట్‌ను మారుస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయంపై వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒక్కసారిగా మార్పులు చేస్తే పారదర్శకత, భాగస్వాముల సంప్రదింపులు, ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ఎదుగుదలపై కీలక ప్రశ్నలు తలెత్తుతాయని పేర్కొంది. వచ్చే ఏడాది ప్రపంచ కప్‌నకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అయితే, 14 జట్లు బరిలోకి దిగుతున్నా.. మూడు దశల కొత్త ఫార్మాట్‌ను తీసుకొచ్చింది. తక్కువ ర్యాంకింగ్ కలిగిన మూడు జట్లలో 'సూపర్ సిరీస్' ద్వారా ఒకటి మాత్రమే అర్హత సాధించనుంది. ఆ తర్వాత గ్రూప్ స్టేజ్, సూపర్ 7 రౌండ్, నాకౌట్ స్టేజ్‌కు మ్యాచులు వెళ్తాయి. దీనివల్ల చిన్న జట్లకు అవకాశాలు తగ్గిపోతాయని డబ్ల్యూసీఏ తెలిపింది. 'మెగా టోర్నీలకు నిర్మాణ స్వరూపాన్ని మార్చే హక్కు ఐసీసీ కి ఉంది. అదే సమయంలో ఆటపట్ల నిబద్ధత, అర్హత మార్గాలు, ప్లేయర్లకు మెరుగైన అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలి. గణనీయమైన మార్పులు చేయా ల్సినప్పుడు సరైన సంప్రదింపులు, పారదర్శకత, స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. వన్డే ప్రపంచ కప్‌లో ఆడాలనేది కెరీర్‌లో చాలా మంది ఆటగాళ్ల ఆకాంక్ష. ఆ ఛాన్స్ కోసం ఎంతో నిబద్ధతతో కష్టపడతారు. ఏళ్ల తరబడి కృషి చేస్తారు. కానీ, ఒక్కసారిగా మార్పులు చేస్తే తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదు" అని డబ్ల్యూసీఏ సీఈవో టామ్ మోఫట్ తెలిపారు.



## కారు రీప్లేస్ చేయాలన్న ఉత్తర్వులు..

### మారుతీ సుజుకీ సవాల్

దిల్లీ: ఇ-20 పెట్రోల్ వినియోగంపై ఓ వైపు అపోహలు, మరోవైపు ప్రభుత్వం స్పష్టత ఇస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇ-20 పెట్రోల్ ఇంజిన్ కలిగిన గ్రాండ్ విటారా కారులో తరచూ సమస్యలు వస్తున్నాయంటూ అందిన ఫిర్యాదుపై మారుతీ సుజుకీకి ఎదురుదెబ్బ తగిలింది. కొత్త కారును ఇవ్వాలంటూ రాయ్‌పుర్ జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాలు చేసేందుకు మారుతీ సుజుకీ సిద్ధమైంది. 2023 జనవరిలో తయారైన గ్రాండ్ విటారా స్ట్రాంగ్ హైబ్రిడ్ జెటాం మోడల్‌ను 2024 జూన్‌లో ఓ వినియోగదారుడు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ఐదు నెలల్లోనే సమస్యలు తలెత్తడం, పనితీరు నెమ్మదించడాన్ని గ్రహించాడు. దీంతో వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించగా.. అనుకూలంగా తీర్పు వెలువరించింది. 45 రోజుల్లో కొత్త వాహనాన్ని ఇవ్వాలని, లేదా రూ.20.50 లక్షలు, ఆర్‌టీఓ, ఇన్సురెన్స్ ఖర్చులు కలిపి చెల్లించాలని కమిషన్ మారుతీ సుజుకీని ఆదేశించింది. వినియోగదారుడిని మానసిక క్షోభకు గురి చేసినందున లక్ష రూపాయలు, లిటిగేషన్ ఖర్చుల కింద మరో రూ.10వేలు కూడా చెల్లించాలని పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వును సవాలు చేయనున్నట్లు మారుతీ సుజుకీ తెలిపింది. ఇ-20 ఇంధనాన్ని వినియోగించుకోవడానికి ఆ కారు పూర్తి అనుకూలంగా ఉందని తెలిపింది. ఇ20 ఇంధనం కోసం అవసరమైన అన్ని సదుపాయాలు ఆ కారుకు ఉన్నాయన్న విషయం యజమాని మాన్యువల్‌లో కూడా వెల్లడించి నట్లు పేర్కొంది. కల్తీ ఇంధనం నింపడం వల్లే తరచూ ఇబ్బందులు తలెత్తుతు న్నాయనడానికి తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొంది. ఈ ఉత్తర్వులపై ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేస్తామని మారుతీ సుజుకీ తెలిపింది.



## ట్రూకాలర్ వంటి యాప్‌లు స్పామ్ డేటాను టెల్కోలకివ్వాలి

### నిబంధనల సవరింపులో ట్రాయ్

**దిల్లీ:** ట్రూకాలర్ వంటి కాల్ నిర్వహణ యాప్‌లకు టెలికాం నియంత్రణాధికార సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనలను తీసుకురానుంది. ఇందుకోసం టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్(టీసీసీసీపీఆర్)కు సవరణలు చేయాలని ప్రతిపాదించింది. తద్వారా కాల్ నిర్వహణ యాప్‌లు, 'వినియోగదార్లు అందించే స్పామ్ సమాచారాన్ని' టెలికాం కంపెనీ (టెల్కో)లతో పంచుకోవాలని నిర్దేశిస్తోంది. ఈ సవరణలకు కొద్ది వారాల్లోనే తుదిరూపునిస్తారని ఈ అంశంతో సంబంధమున్న వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం వినియోగదార్లు లేవనెత్తే స్పామ్ రిపోర్టులన్నీ, యాప్‌ల వద్దే ఉంటున్నాయి. టెల్కోలతో ఆ సమాచారాన్ని అవి పంచుకోవడం లేదు. స్పామ్ కాల్స్, మెసేజ్‌లపై పోరాటాన్ని బలోపేతం చేయడం కోసం టీసీసీసీపీఆర్ (మూడో సవరణ) 2026 ముసాయిదాపై మార్చి 13న ట్రాయ్ ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లు, సెండర్లు, కాల్ నిర్వహణ యాప్‌లకు కఠిన నిబంధనలూ తీసుకురానుంది. దీనిపై వివిధ వర్గాల స్పందనలను ప్రస్తుతం ట్రాయ్ పరిశీలిస్తోంది.



## సమంతకు సర్‌ప్రైజ్ సీమంతం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## ఓటిటిలోకి వచ్చేసిన
# మా ఇంటి బంగారం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన సూపర్‌హిట్ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా 'మా ఇంటి బంగారం' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయాన్ని నమోదు చేసి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్న ఈ చిత్రం, తాజాగా ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'మా ఇంటి బంగారం' కేవలం 28 రోజులకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి రావడం విశేషం. స్టార్ హీరోల సినిమాలకే త్వరగా ఓటీటీ రిలీజ్ లభించే పరిస్థితుల్లో, మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం అదే స్థాయిలో ప్రేక్షకాదరణ పొందడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి రాజ్ నిడిమోరు స్క్రీన్‌ప్లే అందించారు. భావోద్వేగాలు, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి మహిళా ప్రధాన తెలుగు చిత్రాల్లో కొత్త రికార్డు సృష్టించింది. ఈ చిత్రంలో సమంత 'స్వర్ణ' పాత్రలో కనిపించింది. పెళ్లి తర్వాత తొలిసారి భర్త ఇంటికి వెళ్లిన ఓ యువతి, కొత్త కుటుంబంలో కలిసిపోవడానికి ప్రయత్నించే సమయంలో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గత జీవితానికి సంబంధించిన ఓ రహస్యం ఆమె జీవితాన్ని మలుపుతిప్పుతుంది. కుటుంబాన్ని కాపాడుకోవడానికి స్వర్ణ చేసిన పోరాటమే సినిమా ప్రధాన కథ.




## భార్యాబిడ్డల కోసం
# రాజు చేసే సాహసం
### ది ఒడిస్సీ.. మన పురాణ గాధలకు దగ్గరి కథ



వైవిధ్యమైన కథలతో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించే దర్శకుల్లో క్రిస్టఫర్ నోలన్ ఒకరు. ఇప్పటివరకూ తీసిన సినిమాలకు భిన్నంగా గ్రీకు మైథాలజీని కథగా ఎంచుకుని రూపొందించిన తాజా చిత్రం 'ది ఒడిస్సీ'. తన తెలివితేటలతో ట్రాయ్ రాజ్యాన్ని ఓడిస్తాడు ఒడిస్సియస్ (మాట్ డామన్). దాదాపు పదేళ్లుగా సాగుతున్న ట్రోజన్ యుద్ధానికి ముగింపు పలుకుతాడు. అనంతరం సైన్యంతో కలిసి తన రాజ్యం ఇథాకాకు సముద్రమార్గం ద్వారా పయనమవుతాడు. అతడి రాక కోసం భార్య పెనెలోప్ (అన్నీ హాథవే), కొడుకు టెలిమాకస్ (టామ్ హాలెండ్) ఎదురు చూస్తుంటారు. ఒడిస్సియస్ ఎప్పటికీ రాడని, తనని వివాహం చేసుకోవాలని పెనెలోప్‌ను ఆంటినస్ (రాబర్ట్ పాటిన్సన్) ఒత్తిడి చేస్తూ ఉంటాడు. తన శక్తియుక్తులతో ఆమెను వశం చేసుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. పదిరోజుల్లో ఇథకాకు చేరుకోవాల్సిన ఒడిస్సియస్‌కు సముద్ర ప్రయాణంలో ఎలాంటి ఆపదలు వచ్చాయి? ఈ క్రమంలో ఎవరెవరిని ఎదుర్కొన్నాడు? గ్రీకు దేవతలు అతనిపై ఎందుకు కోపం చూపించారు? భార్య, బిడ్డలను కలుసుకోవడానికి ఒడిస్సియస్‌కు పదేళ్లు ఎందుకు పట్టింది? చివరకు కలిశాడా? లేదా అన్నది కథ. ఇతిహాస, పురాణగాథలు ఎన్నో మన ప్రేక్షకులకు సుపరిచితం. గ్రీకు పురాణగాథ 'ది ఒడిస్సీ' కూడా అలాంటిదే. యుద్ధ విజయానంతరం భార్యా బిడ్డలను కలుసుకునేందుకు తన రాజ్యానికి పయనమైన ఒక రాజు చేసే సంక్లిష్ట ప్రయాణమే ఈ కథ. ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలా సన్నివేశాలకు మూలం మన పురాణగాథల్లోనూ కనిపిస్తుంది. కథను ఆద్యంతం అత్యంత నాటకీయ కోణం నుంచి ఆవిష్కరించడంతో మనం కూడా ఒడిస్సియస్‌తో కలిసి ప్రయాణం చేసి, అతడి ప్రతి భావోద్వేగాన్ని అనుభవిస్తాం. రాజు లేని ఇథాకా రాజ్య పరిస్థితిని, రాణి కోసం రాబందుల్లా వేచి చూస్తున్న మనుషులను పరిచయం చేస్తూ కథను మొదలు పెట్టాడు దర్శకుడు. మరోవైపు వయసు పైబడిన ఒడిస్సియస్ ఒక ద్వీపంలో కలిప్సో (ఛార్లెజ్ థెరాన్)తో కలిసి ఉంటూ తన గతాన్ని గుర్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటాడు. ఇలా రెండు వేర్వేరు వృత్తాంతాలను తెరపై చూపిస్తూనే, ఇంకొకవైపు ప్రేక్షకులకు అత్యంత ఉత్కంఠ, ఆసక్తిని కలిగించేలా ఒడిస్సియస్ సముద్ర ప్రయాణాన్ని నోలన్ ఆవిష్కరించాడు. ఈ నేపథ్యంలో వచ్చే ప్రతి ఎపిసోడ్ దేనికదే ప్రత్యేకం. ట్రాయ్‌ను వశం చేసుకోవడానికి చెక్క గుర్రాన్ని చేయడం గానీ, ఆ తర్వాత ట్రాయ్‌పై జరిగే మెరుపుదాడులు అన్నీ వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నం చేశారు. ఒకసారి ఒడిస్సియస్ సముద్రమార్గం పట్టిన తర్వాత వచ్చే ఒంటి కన్ను రాక్షసుడితో యుద్ధం, ఐరన్ షీల్డ్స్ ధరించిన భారీ మనుషుల దాడి నుంచి తప్పించుకునే ప్రయత్నం, సముద్ర సుడిగుండం నుంచి తప్పించుకుని తన మనుషులను బలిఇవ్వడం ఇలా ప్రతి ఎపిసోడ్ ఒక చందమామ కథలాగానే ఉంటుంది. ప్రథమార్ధమంతా ఈ సాహసాల చుట్టూ తిరిగితే, ద్వితీయార్ధంలో డ్రామా ఎక్కువ కనినిపిస్తుంది. ముఖ్యంగా ఇథికాను, పెనెలోప్‌ను దక్కించుకోవడానికి రాజ్యం చుట్టూ మూగిన మూకలను అంతం చేయడానికి ఒడిస్సియస్, అతడి కొడుకు టెలిమాకస్ చేసే ప్రయత్నాలతో సాగుతుంది. క్లైమాక్స్‌లో ఒడిస్సియస్ కత్తిపట్టడం, రాజ్యంపై వాలిన రాబందులను అంతం చేయడంతో కథకు అర్థవంతమైన ముగింపు ఇచ్చారు.

## వరుస ఆఫర్స్‌తో బిజీ బిజీగా ప్రీతీ ముకుందన్

ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఇందులో నటుడు అర్జున్‌కు కుమార్తెగా కనిపించిన యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్.. యాక్షన్ సీన్లలో అదరగొట్టి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అంతే కాకుండా.. తాజాగా వచ్చిన 'హృదయం మురళి'తో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. అంతే కాకుండా.. టైమ్ షెడ్యూల్ సెట్ అవ్వకపోవడంతో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రంలో వచ్చిన ఆఫర్‌ను సైతం రిజెక్ట్ చేసింది. ఇలా బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్‌తో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయిన ప్రీతి ముకుందన్ తాజాగా మరో స్టార్ హీరో సినిమాలో చాన్స్ అందుకున్నట్లు టాక్. ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో 'ఓం', వెట్రిమార్ దర్శకత్వంలో 'తమిళ మురుగన్' ప్రాజెక్టులతో బిజీగా ఉన్న తమిళ స్టార్ హీరో ధనుష్.. తన ఐ56 కోసం కూడా సిద్ధం అవుతున్నాడు.



## డిఫరెంట్ కాన్సెప్ట్ కథ..
# ఓ సుకుమారి




ఈ వారం ప్రేక్షకులకు వినోదం పంచడానికి వచ్చిన చిత్రం 'ఓ..! సుకుమారి'. కథాబలమున్న సినిమాలతో ప్రయాణం చేసే తిరువీర్ కథానాయకుడు కాగా.. ప్రముఖ కథానాయిక ఐశ్వర్య రాజేశ్ ఆయనతో జోడీ కట్టడం, ప్రచార చిత్రాలూ, సినిమాలోని కాన్సెప్ట్ ప్రేక్షకుల్ని ప్రముఖంగా ఆకర్షించిన అంశాలు. యాదగిరి అలియాస్ యాది (తిరువీర్) పెళ్లికి సిద్ధమవుతాడు. పక్క ఊరిలోని ఓ అమ్మాయిని చూడటానికి వెళ్లి దామిని (ఐశ్వర్య రాజేశ్)పై మనసు పడతాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆ ఊళ్లో కూడా ఎలాగైనా దామినికి పెళ్లి చేసి సాగనంపాలనేది గ్రామస్తుల ప్లాన్. దానికి కారణం ఆమెకొక విచిత్రమైన సమస్య ఉండటమే. ఆమెను ముట్టుకోగానే షాక్ కొడుతుంది. ఆ సమస్య వల్ల ఊళ్లో వాళ్లు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతుంటారు. అందుకే యాది ఇష్టపడటమే ఆలస్యం... ఆ ఊరంతా కలిసి దామిని పెళ్లిని ఘనంగా చేసి సాగనంపుతుంది. అసలు చిక్కులు ఆ తర్వాతే మొదలవుతాయి. ముట్టుకుంటేనే షాక్ కొట్టే దామినితో యాదగిరి కాపురం ఎలా చేశాడు? అత్తారింట్లో దామిని ఎలా కలిసిపోయింది? ఆమెకున్న షాక్ సమస్యని తన భర్త ఊరి జనాలు ఎప్పుడు ఎలా తెలుసుకున్నారు?యాది పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం వెనకున్న బలమైన ఆ కారణాలేమిటి?తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. తిరువీర్ ఇటీవల నటించిన 'పాపం ప్రతాప్'లో కథానాయకుడి పాత్రకు సమస్య ఉంటుంది. అది కూడా భార్యాభర్తల మధ్య కాపురానికి సవాల్‌గా నిలిచిన సమస్యే. ఇందులోనేమో కథానాయికకి సమస్య. ఈ రెండూ కూడా గ్రామీణ నేపథ్యంతో సాగే కథలే. మరికొన్ని సారూప్యతలూ కనిపిస్తాయి. ముట్టుకోగానే షాక్ కొట్టే ఓ అమ్మాయి... అది తెలియక ఆమెని పెళ్లి చేసుకున్న ఓ అబ్బాయి... ఆ ఇద్దరి మధ్య కలిసి కాపురం ఎలా సాగించారన్నది ఆసక్తిని రేకెత్తించే విషయమే. నాయకానాయికలు, నిర్మాతలు వినగానే సినిమా చేయడానికి ఒప్పుకొనేలా ప్రేరేపించే కథాంశమే ఇది. కథానాయికకి ఉన్న సమస్య ప్రపంచంలోనే ఒకరిద్దరికి మాత్రమే ఉన్న అరుదైనదని చెప్పారు. అలాంటప్పుడు ఆ సమస్యతో అంతగా కనెక్ట్ కాలేము. పోనీ, అరుదైన సమస్య కదాని సీరియస్‌గా ఏమైనా దాని గురించి చర్చించారా? అంటే అదీ లేదు. షాక్ సమస్య ఎందుకు వచ్చిందో చెప్పారు కానీ, చివరిలో ఎందుకు రాదో చెప్పలేదు.



## అభిమానుల కోసం ఏదైనా చేయడానికి సిద్ధం : శ్రీలీల

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలకు అదృష్టం కలిసిరావడం లేదు. తన టాలెంట్ చూపించినప్పటికీ నిరాశనే ఎదురవుతోంది. ఆమె ఇటీవల నటించిన చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయ్యాయి. ముఖ్యంగా భారీ అంచనాలతో వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్', 'పరాశక్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో ఈ భామపై విమర్శలు వస్తున్నాయి. ఈ వరుస ఫ్లాపుల వల్ల ఆమెను కొన్ని సినిమాల నుండి తొలగిస్తున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. దీనికి తోడు నెట్టింట ట్రోలింగ్ కూడా గట్టిగానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో, తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీలీల ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన అభిమానుల కోసం తాను ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. తనకు అభిమానులను నేరుగా కలుసుకోవడం ఎంతో ఇష్టమని, వారి చూపే ప్రేమ, ఉత్సాహం తనకు కొత్త ఎనర్జీని ఇస్తాయని చెప్పుకొచ్చింది. తనలాంటి కళాకారులను ఎల్లప్పుడూ బ్రతికించేది ప్రేక్షకులేనని, అందుకే వారిని అలరించేందుకు భవిష్యత్తులో మరింత శ్రమించి మంచి సినిమాలను అందిస్తూనే ఉంటానని శ్రీలీల తన పేర్కొన్నారు. ఒకపక్క తెలుగులో ఎదురుదెబ్బలు తగులుతున్నా.. ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం ఆమె తమిళ, హిందీ భాషల్లోని స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ధనుష్ సరసన 'ఐ-55' సినిమాలో నటిస్తూ బిజీగా ఉంది. వీటితో పాటు బాలీవుడ్‌లో కూడా అడుగుపెడుతూ.. క్రేజీ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన మోస్ట్ అవేటెడ్ లవ్ సాగా 'ఆషికి-3' సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైంది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com